రైతుల కష్టం వర్షార్పణం

- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 227 | విజయవాడ, సోమవారం 20 మార్చి 2023 | 6 + 8 పేజీలు పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 20 March 2023 | Rs

కుప్పకూలి..!

- విశాఖలో భారత్ దారుణ ఓటమి
- బ్యాటింగ్, బంతితో ఘోర వైఫల్యం

లోపలి పేజీలో..

ఇఎంఎస్, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళ్లర్పిస్తున్న మధు, వనజ, రమాదేవి, శ్రీనివాసరావు, మంతెన

యావజ్జీవితం ప్రజలకే అంకితం

ఇఎంఎస్, మల్లు స్వరాజ్యం వర్ధంతి సభల్లో ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంపన్న భూస్వామ్య కుటుంబాల్లో పుట్టినా.. కార్మికవర్గ శ్రేయస్సు కోసం నిరంతరం తపించి పోరాడిన మహనీయులు ఇఎంఎస్ నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం అని పలువురు కొనియాడారు. సాంప్రదాయ సంకెళ్లను ఛేదించుకుని శ్రామికవర్గం నేతలుగా ఎదిగారని, యావజ్జీవితాన్ని ప్రజల కోసమే అంకితం ఇచ్చిన గొప్ప నేతలని పేర్కొన్నారు. రాజకీయాలు వ్యాపారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ నేతలు ఎంత నిరాడంబరంగా, నిస్వార్థంగా, త్యాగపూరిత జీవితాలు గడపాలో ఈ ఇద్దరు నేతలు ఆచరించి చూపారని స్మరించుకున్నారు. సిపిఎం అగ్రనాయకులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఇఎంఎస్ నంబూద్రిపాద్ 25వ వర్ధంతి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల సభలు నిర్వహించి ఘన నివాళులర్పించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగిన వర్ధంతి సభలో ఇరువురు నేతల చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని ప్రజా పోరాటాలను, ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడానికి ఇఎంఎస్ సైద్ధాంతిక కృషి, మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి దోహదపడతాయన్నారు. ఇఎంఎస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రెండు సంవత్సరాల్లోనే కేరళ రాష్ట్రంలో భూ సంస్కరణలు అమలు చేశారని, విద్యాహక్కు చట్టం తీసుకొచ్చి అందరికి విద్యను అందించేందుకు కృషి చేశారన్నారు. దేవాలయాలపై భూస్వాముల పెత్తనాన్ని తొలగించి కౌలు దారులకు హక్కులు కల్పించారని తెలిపారు. మల్లు స్వరాజ్యం చారిత్రాత్మక తెలంగాణా సాయుధపోరాటంలో తుపాకి పట్టుకుని శతృవులపై పోరాడిన యోధురాలని ఆయన కొనియాడారు. ఆమె పోరాడటంతో పాటుగా గ్రామ గ్రామాన తిరిగి ప్రజలను చైతన్యవంతులను చేసి మహిళలచేత తుపాకి పట్టించి పోరాటంలోకి ఉరికించారని అన్నారు. కమ్యూనిజానికి ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తుది వరకు తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం దేశంలో భూ సమస్యను అజెండాగా ముందుకు తీసుకొచ్చిందని, దేశంలో బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసిందని అన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా 1970 ప్రాంతంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములనే ఈ రోజు తిరిగి కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు అప్పగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు ఉద్యమం

మిగతా 2లో

ఇక డిజిటల్ తరగతులు

- జగనన్న విద్యా దీవెన సభలో సిఎం జగన్
- కుట్ర రాజకీయాలకు భయపడనని వ్యాఖ్య

ప్రజాశక్తి- విజయవాడ ప్రతినిధి, తిరువూరు

నాడు-నేడు పూర్తయిన పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. కుట్ర రాజకీయాలకు భయపడబోనన్నారు. పేదలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై దుష్టచతుష్టయంలో ఉన్న తోడేళ్లన్నీ ఏకమై ముప్పేట దాడికి తయారవుతున్నాయని, ఇవన్నీ కలిసినా తననేమీ చేయలేవని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం జరిగిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో బటన్ నొక్కి రూ. 698.68 కోట్ల నిధులను 8,83,723 మంది తల్లుల ఖాతాల్లో ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యకు సంబంధించి ఎంతో మంచి మార్పులు చేస్తుంటే దుష్టచతుష్టయం ఓర్చుకోలేకపోతోందని విమర్శించారు. 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. విలువలులేని దుష్టచతుష్టయంతో యుద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని దోచుకుతినడానికి తోడేళ్లన్నీ ఏకమై పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయని విమర్శించారు. పేదల కోసం పనిచేస్తున్న తనకు నమ్మకం, ధైర్యం, అండ అన్నీ ప్రజలేనని పేర్కొన్నారు. ఎల్లో మీడియాకు, కుట్ర రాజకీయాలకు తాను భయపడేది లేదన్నారు. ఇదివరకు దోచుకో, పంచుకో, తినుకో (డిపిటి) పద్ధతిలో పరిపాలన సాగితే, తమ ప్రభుత్వం నేరుగా డిబిటి ద్వారా లబ్ధిదారుని ఖాతాలో డబ్బులు జమ చేస్తోందని అన్నారు. ఇదే బడ్జెట్ ఉన్న టిడిపి హయాంలో చంద్రబాబు పేదలకు ఎందుకు డబ్బులు నేరుగా ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పటి బడ్జెట్ నిధులన్నీ నీరు-చెట్టు, జన్మభూమి కమిటీల పేరుతో పెత్తందారులు దోచుకుతిన్నారని ఆరోపించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నామన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తామని తెలిపారు. ఉన్నత విద్యలో మంచి ప్రమాణాలతో మార్పులు చేస్తున్నామన్నారు. జాబ్ ఓరియంటెడ్ కోర్సులను, కరిక్యులమ్‌లను మారుస్తున్నామని తెలిపారు. గత 45 నెలలుగా విద్యా వ్యవస్థలో జరుగుతున్న అభివృద్ధిని, మార్పును గమనించాలని కోరారు. జీవన ప్రమాణాలు పెరగాలంటే చదువు ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు.

చెక్కును ఆవిష్కరిస్తున్న సిఎం వైఎస్ జగన్

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాదిరిగా పేదరికాన్ని జయించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. పూర్తి స్థాయిలో ఫీజురీయింబర్స్ చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 27 లక్షల మంది విద్యార్థులకు దాదాపు రూ. 9,947 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 నుంచి 2019 వరకు టిడిపి హయాంలోని రూ.1,777 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా చెల్లించామన్నారు. కళాశాలల్లో సమస్యలుంటే 1092కి నేరుగా ఫోన్ చేస్తే ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపారు. ప్రపంచంతో పిల్లలు పోటీ పడాలని, సత్య నాదెళ్ల మాదిరిగా ఎదగాలని ఆకాంక్షించారు. 2018-19లో 87,400 మంది ఇంజనీరింగ్‌లో వంటి కోర్సుల్లో చేరితే తమ ప్రభుత్వం చేపట్టిన విద్యా, వసతి దీవెనల వల్ల ఆ సంఖ్య 1.25 లక్షలకు పెరిగిందన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా ఉద్యోగాల పొందే వారి సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, తానేటి వనిత, మేరుగ నాగార్జున, కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం, గిరిజన సంఘం నాయకులు గృహ నిర్బంధం

ముఖ్యమంత్రి తిరువూరు వస్తున్న నేపథ్యంలో పోలీసులు శనివారం రాత్రి పలువురు సిపిఎం, గిరిజన సంఘం నాయకులను గృహనిర్బంధం చేశారు. సిఎం పర్యటన తర్వాత వారిని విడిచిపెట్టారు. రైతుసంఘం ఎ.కొండూరు మండలం కార్యదర్శి ఆళ్ల అమ్మిరెడ్డి, మరికొందరు రైతులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

రాంగోపాల్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న కలెక్టర్

ఎట్టకేలకు డిక్లరేషన్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి ఎట్టకేలకు డిక్లరేషన్ ఫారాన్ని రిటర్నింగు అధికారి, అనంతపురం జిల్లా కలెక్టరు ఎస్ నాగలక్ష్మి ఆదివారం అందజేశారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలోనే కౌంటింగ్ పూర్తయింది. కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయంటూ వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఆరోపించడమే కాకుండా రీకౌంటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. కొంతసేపు కౌంటింగ్ కేంద్రంలో నిరసన తెలిపారు. ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలోనే ఎన్నికల ఫలితాలను కలెక్టరు ఎస్ నాగలక్ష్మి ప్రకటించారు. కానీ, ఎన్నికైన అభ్యర్థికి డిక్లరేషన్ ఫారం ఇవ్వలేదు. దీంతో, డిక్లరేషన్ ఇవ్వాలంటూ టిడిపి నాయకులు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తదితరులు శనివారం రాత్రి ఆందోళనకు దిగడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు. ఎట్టకేలకు కలెక్టరు నాగలక్ష్మి ఆదివారం ఉదయం 9.30 గంటలకు తన ఛాంబరులో రాంగోపాల్‌రెడ్డికి డిక్లరేషన్ ఫారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి నుంచి అనుమతులు రావడం ఆలస్యమైనందునే డిక్లరేషన్ అందజేయడంతో జాప్యమైందని తెలిపారు.

మోటార్లకు మీటర్లు... రైతులకు ఉరితాళ్లు

- టిడిపి వాయిదా తీర్మానం
- తిరస్కరించిన స్పీకర్
- పోడియం వద్ద టిడిపి సభ్యుల ఆందోళన
- 11 మంది సస్పెన్షన్



స్పీకర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎఫ్ఆర్‌బిఎం అప్పు కండీషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు పెడుతోందని, దీనివెనుక వెనుక పెద్ద కుంభకోణం వుందని ఇవి రైతులకు ఉరితాళ్లుగా మారతాయని తెలుగుదేశం ఎమ్మెల్యేలు శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన ఈ అంశంపై సభలో చర్చించాలని వాయిదా తీర్మానం ఇచ్చారు. దీనిపై చర్చించాలని పట్టుబట్టారు. అత్యవసరమైన అంశమని వెంటనే చర్చించాలని కోరారు. దీనికి స్పీకర్ ససేమిరా అన్నారు. దీంతో టిడిపి సభ్యులు నిలుచుని నినాదాలు చేశారు. చర్చకు అవకాశం ఇవ్వాలని కోరారు. స్పీకర్ స్పందించకపోవడంతో ఆయన పోడియాన్ని చుట్టుముట్టారు. పోడియం పైకి వెళ్లి నినాదాలు చేశారు. అప్పటికీ స్పందించకపోవడంతో పేపర్లు చించి స్పీకర్‌పై వేశారు. దీంతో చీఫ్ విఫ్ ప్రసాదరాజు టిడిపి సభ్యులను సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రతిపాదించారు.

అచ్చెన్నాయుడు, చిన రాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గద్దె రామ్మోహన్‌రావు, జోగేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు, ఏలూరి సాంబశివరావు, గణబాబు, మంతెన రామరాజు, డోల బాల వీరాంజనేయస్వామి, ఆదిరెడ్డి భవానీ, గొట్టిపాటి రవిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తాము తప్పుచేయలేదని, ఎందుకు సస్పెండ్ చేస్తున్నారని టిడిపి సభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడు స్పీకర్‌ను ప్రశ్నించారు. ఈలోపు మార్షల్స్ సభలోకి రావడంతో సభ్యులు అక్కడే బైఠాయించారు. వారిని మార్షల్స్ బయటకు పంపించి వేశారు. అంతకుముందు టిడిపి సభ్యులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ వుండదని, అవసరం లేదని ఇంధనశాఖ కార్యదర్శి విజయానంద్ రెండు పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. సొంతమనుషులకు రూ.6 వేల కోట్లను దోచిపెట్టేందుకే మీటర్లకు

మిగతా 5లో

పెన్షనర్ల ఉసురు తీస్తున్న మోడీ

- ఎపిఆర్‌పిఎ రాష్ట్ర మహాసభలో ఎఐసిసిఇపిఎఫ్‌పిఎ జాతీయ ప్రధాన కార్యదర్శి ధర్మజన్

లోపలి పేజీలో..

గుండెపోటు రాకుండా స్టెమీ భరోసా

- రూ.120 కోట్లతో కర్నూలు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాథల్యాబ్‌ల ఏర్పాటు

లోపలి పేజీలో..

యుపి విద్యుత్ ఉద్యోగుల విజయం

- కేసులు ఎత్తివేత, ఉద్యోగులపై చర్యలు రద్దు
- ప్రభుత్వ హామీతో సమ్మె విరమణ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్‌శాఖ ఉద్యోగుల సమ్మె తీవ్రరూపం దాల్చడంతో, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. ఉద్యోగుల డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. దీంతో, ఉద్యోగులు 60 గంటలకుపైగా కొనసాగిన సమ్మెను ఆదివారం విరమించారు. విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు, విద్యుత్ శాఖ మంత్రి ఎకె శర్మ మధ్య జరిగిన మూడో దశ చర్చల్లో ప్రభుత్వం ఈమేరకు హామీ ఇచ్చింది. సమ్మెను విరమిస్తున్నామని, వెంటనే విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ఉద్యోగులు ప్రకటించారు. తొలగించిన సుమారు మూడు వేల మంది ఉద్యోగులను మళ్లీ ఉద్యోగాల్లో చేర్చుకుంటామని, 22 మంది ఉద్యోగులపై పెట్టిన అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం (ఎస్మా) కేసులను ఉపసంహరించుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో సమ్మె విరమించాలని నిర్ణయించినట్లు విద్యుత్ కర్మచారి సంయుక్త సంఘర్ష్ సమితి (వికెఎస్ఎస్ఎస్) కన్వీనర్ శైలేంద్ర దూబే ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కొంత సమయం ఇవ్వాలని ఉద్యోగులు నిర్ణయించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా దెబ్బతిన్న చోట్ల పునరుద్ధరించేందుకు వీలుగా తక్షణమే విధుల్లో చేరాలని ఉద్యోగులు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఉత్తరప్రదేశ్ లోని సుమారు లక్ష మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు గురువారం నుంచి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని, విద్యుత్ (సవరణ) బిల్లు 2022ను వెనక్కి తీసుకోవాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వంటి డిమాండ్లతో సమ్మె ప్రారంభించారు. దీంతో, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా నిర్వహణ, మరమ్మతులు, ప్రజాసమస్యల ఫిర్యాదుల పరిష్కారంపై తీవ్ర ప్రభావం పడింది. సమ్మెను అణిచివేయడానికి యోగి ప్రభుత్వం అనేక విధాలుగా ప్రయత్నించింది. ప్రభుత్వ ఆస్థులకు నష్టం వాటిల్లితే జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ)ను ప్రయోగిస్తామని బెదిరించింది. మూడు వేల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. 22 మందిపై ఎస్మా కేసులను నమోదు చేసింది. అయినా ప్రభుత్వ బెదిరింపులకు భయపడకుండా ఉద్యోగులు ఐక్యంగా సమ్మె కొనసాగించారు. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఒఇఇఇ), సిఐటియు సహా పలు కార్మిక సంఘాలు సమ్మెకు మద్దతు పలికాయి. సమ్మె తీవ్రరూపం దాలుస్తుండటంతో యోగి ప్రభుత్వం దిగివచ్చింది.

పట్టణ ఆస్తులకు భూ హక్కు పత్రం

సభలో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

- రెవెన్యూ మంత్రి ధర్మాన
- అసైన్‌మెంట్ కమిటీలు యాక్టివేట్ చేయాలి : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నట్లు పట్టణ ప్రాంతాల్లో ఆస్తులకు భూ హక్కు పత్రం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకోసమే చట్టంలో సవరణలు తెస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. చుక్కల భూములు, ఇనాం భూములు చట్టంలో సవరణలకు సంబంధించిన బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. ఈ సందర్భంగా సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ ఇక ముందు పట్టణ ఆస్తులకు పట్టాదారు పాస్ పుస్తకాలు క్రియేట్ చేయడంతో పాటు భూహక్కు పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ మునిసిపల్ కార్యాలయాల్లో అసెస్‌మెంట్ రిజిస్టర్‌లో ఉండేవన్నారు.

చట్టంలో మార్పులు తేవాలి : అన్నా రాంబాబు

ఇనాం భూములు, దేవస్థాన భూములు గురించి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రభుత్వానికి సూచించారు. ఏ డిపార్టుమెంట్లో అయినా అన్యాయం జరిగినట్లు తేలితే చర్యలు ఉంటాయన్నారు. అలా కాకుండా ఆస్తులను రెవెన్యూ అధికారులు సంరక్షించే విధంగా చట్టంలో మార్పులు తేవాలని కోరారు. అసైన్‌మెంట్ కమిటీలను యాక్టివేట్ చేయాలన్నారు.

పేదల ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్లు : భూమన

తిరుపతిలోని మఠాలు, దేవాదాయభూముల్లో సుమారు 60 వేలమంది పేదలు 50 సంవత్సరాలకు పైగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నప్పటికీ ఆ ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్లకు నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మార్పులు హర్షణీయం : గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రెవెన్యూలో అవినీతి తగ్గిపోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంస్కరణలు తీసుకురావడం హర్షణీయమని రాయచోటి

మిగతా 2లో

'చలో విజయవాడ'పై నిర్బంధం

- ఎక్కడికక్కడ అడ్డగింతలు, అరెస్టులు, నోటీసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, జిఒ 1 రద్దు పోరాట కమిటీలు సోమవారం చలో విజయవాడ, చలో అసెంబ్లీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ఆయా సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. జిఒ 1 రద్దు పోరాట కమిటీ కన్వీనర్ ముప్పాళ్ల సుబ్బారావుకు 151 నోటీసు ఇచ్చి పోలీసులు ముందస్తు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. అంగన్‌వాడీ నాయకులను నిర్బంధించారు. సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నుంచి నిర్బంధాన్ని ప్రయోగించారు. పలు జిల్లాల్లో అంగన్‌వాడీ ఉద్యోగులను, సిఐటియు నాయకులను అడ్డుకొని అరెస్టు చేశారు. ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారు. కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. కొందరికి 149 సిఆర్‌పిసి కింద నోటీసులు ఇచ్చారు. విజయనగరంలో జిల్లాలో 91 మందిని అరెస్టు చేసి బొబ్బిలి, బాడంగి, విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో పలువురు సిఐటియు, అంగన్‌వాడీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. చిప్పగిరి మండలంలో అంగన్‌వాడీ వర్కర్లను గృహ నిర్బంధంలో ఉంచారు. జిల్లా కేంద్రమైన నంద్యాలలో సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరులో బస్సులో విజయవాడ బయలుదేరిన వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారికి భోజనం కూడా పెట్టలేదు. అనంతపురం జిల్లా గుంతకల్లులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రేష్మాను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు యం.శోభారాణితోపాటు కార్యకర్త నీరజ, ఆయాలు జి.భాగ్యలక్ష్మి, జి.కోటేశ్వరిని చంటి పిల్లలతో సహా స్టేషన్‌కు పిలిపించి పోలీసులు నోటీసులు ఇచ్చారు. సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. చలో విజయవాడకు వెళ్తే చర్యలు తీసుకుంటామంటూ ఆ జిల్లాలోని అంగన్‌వాడీలకు సెక్షన్ 149 సిఆర్‌పిసి కింద నోటీసులు అందించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, శ్రీసత్యసాయి, పల్నాడు, కడప, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. పలువురిని గృహ నిర్బంధంలో ఉంచారు.

సిపిఎం, సిపిఐ ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ సోమవారం విజయవాడలో మహాధర్నాకు అంగన్‌వాడీలు సిద్ధమవుతున్న నేపథ్యంలో దీనిని భగ్నం చేసేందుకు పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు చేయడాన్ని, నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిఓ నెంబరు 1కి వ్యతిరేకంగా చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన పౌరహక్కుల సంఘాల నాయకులు ముప్పాళ్ల సుబ్బారావుతో సహా కార్యకర్తలను గృహ నిర్బంధంలో ఉంచారని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లిలో సిపిఎం నాయకులనూ అరెస్టు చేశారని పేర్కొన్నారు. న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకోవడానికి విజయవాడ బయలుదేరుతున్న కాటికాపర్లు, శ్మశానకార్మికులనూ అరెస్టు చేస్తున్నారని పేర్కొన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్పను నిరోధించారని వివరించారు. ముఖ్యమంత్రి తిరువూరు పర్యటన సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లాల్లో అనేక మందిని అక్రమంగా అరెస్టు చేశారని, చనిపోయిన వారి బంధువులను పలకరించడానికి వెళ్తున్న వారినీ అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అప్రజాస్వామిక చర్యలకు స్వస్తి చెప్పి ప్రజల వాక్కును వినాలని కోరారు. శాసనమండలి ఎన్నికల ఫలితాల తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోకుండా నిరంకుశ పద్ధతులతో ప్రజాగళాన్ని అణచివేయాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని, నోటీసులను ఉపసంహరించుకోవాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

ప్రజాతంత్ర వాదులు ఖండించాలి..

చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అరెస్టులతో ఆపాలనే ప్రభుత్వ చర్యలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఖండించారు. ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. శాంతియుత ఉద్యమంపై పోలీసులతో ఉక్కుపాదం మోపడం తగదని, జిఓ నెంబరు 1ని తక్షణమే రద్దు చేయాలని కోరారు.

చంద్రబాబు ఆదేశాలతోనే సీమెన్స్‌కు రూ.371.80 కోట్లు

- స్కిల్ డెవలప్‌మెంట్‌పై చర్చలో మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సీమెన్స్ కంపెనీకి నిధులు విడుదల చేసేందుకు ఆర్థికశాఖ అధికారులు అభ్యంతరం తెలిపినా అప్పటి సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతోనే రూ.370.78 కోట్లు నిధులు విడుదల చేశారని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడించారు. శాసనసభలో ఆదివారం "గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్, స్కిల్ డెవలప్‌మెంట్ ,యువతకు ఉద్యోగ అవకాశాలు" అనే అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి బుగ్గన మాట్లాడారు. జిఓకు ఎంఓయులోని వివరాల మధ్య తేడా ఉందని కేవలం ఒక నోట్ ఆధారంగా స్పెషల్ ఐటమ్‌గా క్యాబినెట్ ఆమోదించిందన్నారు, ప్రాజెక్టు డిపిఆర్, సర్టిఫికేషన్ లేకుండానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. రూ.3,356 కోట్ల ప్రాజెక్టుకు అప్పటి ప్రభుత్వం ఆమోదించిందని, ఇదే అంశాన్ని జిఓలో పేర్కొన్నారని బుగ్గన తెలిపారు. ఒప్పందం సమయానికి జిఓలో అంశాలు కనుమరుగయ్యాయన్నారు. ఒక్క పైసా కూడా సీమెన్స్ కంపెనీ నుంచి రాకుండానే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయని సభకు మంత్రి వివరించారు. జిఎస్‌టి అధికారుల ఆరాతో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఇడి, సెబీ సోదాల్లో అవన్నీ షెల్ కంపెనీలుగా గుర్తించారన్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని ఇడి, సిఐడి అరెస్టు చేసిందన్నారు. సిఐడి ఈ కేసును వేగవంతగా దర్యాప్తు చేస్తోందన్నారు. డిజ్‌టెక్ కంపెనీ నుంచి ఈ ప్రాజెక్టులో ఏ భాగస్వామ్యమూ లేకుండా ఎంఓయు కుదుర్చుకున్నారని మంత్రి బుగ్గన పేర్కొన్నారు. ఎంఒయుపై గంటా సుబ్బారావు, సుమన్‌బోస్, సంతోష్ సారా సంతకాలు ఉన్నాయన్నారు. నిధుల విడుదల చేసే సమయంలో సరైన వివరాలు నమోదు చేయలేదని, లెటర్ నెంబరు లేకుండానే నిధులు విడుదల చేశారని అన్నారు. మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ఓ దొంగల ముఠా కథని, నిరుద్యోగులను చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పట్టణ ఆస్తులకు భూ హక్కు పత్రం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బిల్లులో ఆంధ్రప్రాంతం అని పేర్కొన్నారని, అంటే కొన్ని జిల్లాలకే పరిమితమా లేక అందులో రాయలసీమ కూడా ఉందా లేదా అనే సందేహం ఉందన్నారు. భూముల రీసర్వేలో క్యూఆర్ కోడ్ కనిపించే విధంగా చేయడం మంచిదన్నారు. చుక్కల భూముల పేరుతో అమ్ముకునే హక్కు లేదని, 12 సంవత్సరాలు ఉంటే అమ్ముకునే హక్కు చట్టం తేవడం జరిగిందని తెలిపారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో అవినీతి లేకుండా చేయాలన్నారు. గుంటూరు ఎమ్మెల్యే ముస్తాఫా మాట్లాడుతూ గుంటూరు నగరంలో 180 ఎకరాలు భూమి ఉందని, ఇది ఆక్రమణలకు గురవుతోందని, ముస్లిములకు లీజు లేక అద్దె ప్రాతిపదికన ఇస్తే ఆదాయం కూడా వస్తుందని అన్నారు. వీటితో పాటు 40 ఎకరాల నుంచి అనేక మంది ఇళ్ల నిర్మించుకున్న వారికి పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఓర్వకల్లు, పాణ్యం ప్రాంతాల్లో సోలార్, విండ్ ఎనర్జీ కోసం ప్రభుత్వం భూములు తీసుకుందని, రికార్డుల్లో వాస్తవ యజమాని పేరు కాకుండా వేరొకటి పేర్లు ఉన్నాయని తెలిపారు. వాస్తవంగా ఆయా భూములు సాగుచేసుకుంటున్న నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాల గిరి మాట్లాడుతూ ఇనామ్ భూముల సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు.

ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది

- వైసిపికి కర్రుకాల్చి వాతపెట్టారు • ఉగాది పంచాంగాన్ని ముందే చెప్పారు • ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చింది మార్పుకాదని తిరుగుబాటని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. సిఎం జగన్‌ది ధనబలం, రౌడీయిజమైతే తమది ప్రజాబలమని, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు వైఫీపి అంటున్నారని విమర్శించారు. శాసనమండలి పట్టభద్ర నియోజకవర్గ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించిన సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు తమ ఓట్ల ద్వారా టిడిపిపై నమ్మకం, విశ్వాసాన్ని చాటారని చెప్పారు. ఉగాది పంచాంగాన్ని రెండు రోజుల ముందే ప్రజలు ఈ ఎన్నికల ద్వారా చెప్పారని తెలిపారు. నాలుగేళ్ల అరాచక పాలనలో భయంగా బతుకుతున్న సగటు మనిషి ఆవేదన ఈ ఎన్నికల్లో ఉందన్నారు. రాష్ట్రంలో 108 నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయని, ఒక్కో నియోజకవర్గంలో ఐదు నుంచి 25 వేల ఓట్లు వేశారని తెలిపారు. తాము పిడిఎఫ్, ఇతర రాజకీయ పార్టీలతో ఒక అవగాహనతో రెండో ప్రాధాన్యత ఓటులో పరస్పరం సహకరించుకున్నామని తెలిపారు. సహకరించిన పిడిఎఫ్, సిపిఎం, సిపిఐలను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నామని చెప్పారు. టిడిపి అధికారంలోకి వస్తుందనడానికి నిన్నటి ఎన్నికల ఫలితాలే సూచనని అన్నారు. జగన్ పని అయిపోయిందని, మరలా గెలిచే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఓటర్లను అవమానించేలా వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి బుద్ధి, జ్ఞానం లేకుండా

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

మాట్లాడారని విమర్శించారు. ఒక సెక్షన్ ఓట్లు వేశారని, వాళ్లకు ఏమీచేయలేదని సజ్జలే ఒప్పుకున్నారని తెలిపారు. మీరు చేశామంటున్న సెక్షన్ ప్రజలు కూడా ఫ్యాన్ పని అపోయిందనే అంటున్నారని అన్నారు. జంగారెడ్డిగూడెంలో పిల్లలు ఫ్యాన్లు పీకేసి పడేస్తే స్టేషన్‌లో వేస్తారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ బెదిరింపులు, ప్రలోభాలను ప్రజలు ఖాతరు చేయలేదన్నారు. ఈ ఎన్నికలు సెమీఫైనల్స్, విశాఖపట్నం రాజధానికి రిఫరెండం అని చెప్పినా నమ్మకుండా ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. ఈ నాలుగేళ్లలో రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు పనిచేయడానికి వీల్లేకుండా చేశారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఐఎఎస్, ఐపిఎస్‌లందరూ జగన్ నేరాల్లో భాగస్వాములవుతు న్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా అధికారులు లెక్కచేయడం లేదని ప్రశ్నించారు. అభ్యర్థి గెలిచినా డిక్లరేషన్ ఇవ్వకుండా రాత్రంతా హైడ్రామాలు ఆడరని మండిపడ్డారు. జగన్ గెలిచింది కేవలం పులివెందుల ఓట్లతోనే అని, టిడిపి అభ్యర్థి రాంభూపాల్ రెడ్డి మూడు జిల్లాల ఓట్లతో గెలిచారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేత కలిసి కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిని ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని, దేశస్థాయిలో ఇంతకసరత్తు జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడా నికి తాము పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. స్థానిక ఎస్‌పి, కలెక్టర్లపై ఒత్తిడి పెట్టి ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా తుంగలో తొక్కారని విమర్శించారు. అధికారులు కూడా తిరుగుబాటుకు సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఉపాధ్యాయులను వైసిపి ప్రభుత్వం పెట్టినంత బాధలు ఎవరూ పెట్టలేదన్నారు. అయినా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపినే గెలవడం బాధ కలిగించిందన్నారు. డబ్బుప్రభావం పనిచేసిందా, బెదిరింపులు పనిచేశాయా, ప్రలోభాలకు లోనయ్యారా అనేది ఆలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, నిమ్మల రామానాయుడు, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పాల్గొన్నారు.

4765 వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ

- త్వరలో నోటిఫికేషన్ : మండలిలో మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖలో 4765 వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయిన తరువాత ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. శాసనమండలిలో ఎపి పారా వెటర్నరీ, అనుబంధ కౌన్సిల్ బిల్లుపై చర్చ అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో రెండు సార్లు నోటిఫికేషన్ జారీ చేసినా అర్హత కలిగిన అభ్యర్థులు లేకపోవడం వల్ల ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో 4518 మందిని గ్రామ సచివాలయాల స్థాయిలో నియమించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమ్మణ్యం మాట్లాడుతూ వెటర్నరీ పాలిటెక్నిక్‌లు ప్రభుత్వ రంగంలో కన్నా ప్రైవేటురంగంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రైవేటు కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేవని, సీట్లను అమ్ముకుంటున్నారని, నాణ్యమైన విద్యను అందించడం లేదని ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తీసుకుని సర్టిఫికెట్స్ ఇచ్చి పంపుతున్నారని, వాటికి విలువ ఉండటం లేదని తెలిపారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా శిక్షణా కేంద్రాలు నెలకొల్పేందుకు అవకాశం ఉంటుందని శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి కూడా కల్పించాలని అన్నారు. టిడిపి ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ గతంలో ఉన్న గోపాలమిత్రలను తొలగించి వెటర్నరీ పోస్టులు భర్తీ కావడం లేదనడం సరికాదని అన్నారు. గోపాలమిత్రల్లో అర్హత కలిగిన 290 మందికి వెటర్నరీ అసిస్టెంట్లను నియమించామని మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. మిగతా వారిని ప్రభుత్వ కార్యాలయాల్లో సబార్డినేట్ ఉద్యోగాల్లో నియమించాలని ప్రతిపాదించామని తెలిపారు. తాజాగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారా మెడికల్ సిబ్బందిని నియమించేందుకు ప్రతిపాదనలకు సంబంధించి బిల్లును ప్రవేశపెడుతున్నామని తెలిపారు. చర్చ అనంతరం బిల్లును ఆమోదించారు.

వ్యాట్ టాక్సు బిల్లుకు ఆమోదం

ఆంధ్ర ప్రదేశ్ విలువ ఆధారిత పన్ను సవరణ బిల్లును ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మండలిలో ప్రవేశపెట్టారు. జిఎస్‌టి పరిధిలోకి రాని వివిధ రకాల ఆయిల్స్‌కు వ్యాట్ అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన పన్నుల సవరణ బిల్లును ప్రతిపాదిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఎటువంటి చర్చా లేకుండా బిల్లును మండలి ఆమోదించింది.

సహకార వ్యవస్థ బలోపేతం

- ఆప్కాబ్, డిసిసిబిలకు ఒకే సర్వీసు రూల్స్
- మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సచివాలయం రెండో బ్లాకు సమావేశ మందిరంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పర్సన్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆప్కాబ్, డిసిసిబి బ్యాంకులకు ఒకే సర్వీసు రూల్స్ వర్తించేలా రాష్ట్ర స్థాయిలో ఒక పాలసీని రూపొందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కో ఆపరేటివ్ బ్యాంకులు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండాలన్నారు. రైతులకు రుణాలను ఇవ్వడంలో మొదటి ప్రాధాన్యత ఇస్తూ బహిరంగ మార్కెట్‌లో ఇతర ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా కో ఆపరేటివ్ బ్యాంకులను ప్రత్యేక బ్రాండింగ్‌తో ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఖాతాదారులను డిపాజిట్లను పెంచుకోవడానికి దృష్టి సారించాలన్నారు. రైతులు రుణాలు పొందడం, తిరిగి చెల్లించడంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఆప్కాబ్ సెంట్రల్ బ్యాంకుల తరహాలో పరపతి సంఘాలూ పనిచేయడానికి కృషి చేయాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో ఆప్కాబ్ ఛైర్మన్ ఎం.ఝాన్సీరాణి, ఎమ్‌డి డాక్టర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, వివిధ జిల్లాల డిసిసిబి ఛైర్మన్లు పాల్గొన్నారు.

రైతు కష్టం వర్షార్పణం

- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- తడిసిన ధాన్యం • నేలరాలిన మామిడి, మొక్కజొన్న, అరటి

ప్రజాశక్తి-యంత్రాంగం

అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలను నీటిపాలు అయ్యాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా పలు జిల్లాల్లో గత మూడు రోజులుగా ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న, అరటి పంటలు నేలవాలగా, ధాన్యం తడిసిపోయింది. మిర్చి, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. మామిడి పిందె, పూత నేలరాలాయి. పిడుగుపాటుకు 78 జీవాలు మృత్యువాత పడ్డాయి. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రూరల్ మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. 50 ఎకరాల్లో మామిడి, 20 ఎకరాల్లో నిమ్మ తోటలు దెబ్బతిన్నాయి. బుచ్చినాయుడు కండ్రిగలో వరిపంట నేలకొరిగింది. రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో నీరు నిల్వ ఉండడంతో వేరుశెనగ పంట దెబ్బతింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణం నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా సోమల మండలంలో కురిసిన భారీ వడగళ్ల వర్షానికి టమోటా, బొప్పాయి, కర్బూజా, మామిడితో పాటు పలు పూల తోటలు దెబ్బతిన్నాయి. సుమారు 12 ఎకరాల్లో టమోటా పంట నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు పాలసముద్రం మండలంలో మామిడి, సపోటాలు నేలరాలాయి. పలమనేరులో మామిడి పిందె, పూత రాలిపోయాయి. కడప జిల్లాలోని వేంపల్లె, ముద్దనూరు మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేంపల్లెలో అరటి, నిమ్మ, మామడి, చీని తోటలు దెబ్బతిన్నాయి. 255 ఎకరాల్లో అరటి, 30 ఎకరాల్లో చీని, 141 ఎకరాల్లో నిమ్మ,

కడప జిల్లా వేంపల్లెలో నేలకొరిగిన అరటి చెట్లు

132 ఎకరాల్లో తమలపాకులకు నష్టం వాటిల్లింది. ముద్దనూరులో సుమారు 176 ఎకరాల్లో అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. ఎర్రగుంట్ల మండలం దండుపల్లిలో వర్షానికి రేకుల ఇల్లు కూలడంతో దంపతులు ఎర్రగొర్ల కృష్ణయ్య, లక్షుమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. నెల్లూరులో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షం కారణంగా తడిసి ముద్దయింది. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో అత్యధికంగా 72.2 మిలీమీటర్ల వర్షపాతం నమోదయింది. లావేరు మండలంలో చేతికొచ్చిన మొక్కజొన్న పంట వర్షానికి తడిచిపోయింది. టెక్కలి మండలం అయోధ్యాపురం పంచాయతీ పరిధిలోని దీపావళి గ్రామంలో పిడుగుపాటుకు 78 జీవాలు మృతి చెందాయి. శ్రీకాకుళం నగరం బలగలోని భద్రమ్మగుడిపై పిడుగు పడడంతో ఆలయ గోడలకు బీటలు వారాయి. గుడి గోపురంపై ఉన్న విగ్రహం ధ్వంసమైంది. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లో కళ్లాల్లో ఉన్న మిర్చి వర్షానికి తడిసిపోయింది. కృష్ణా జిల్లాలో వర్షం కారణంగా పంట పొలాల్లో మినుప కాడ నీట మునిగి మినుములు ఉబ్బిపోయాయి. గుడ్లవల్లేరు మండలంలో కూరాడ వద్ద రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, డుంబ్రిగుడ, జికె.వీధి మండలాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు పడ్డాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం మోసయ్యపేట, గొలుగొండ మండలం గుండుపాల గ్రామాల్లో పిడుగుల ధాటికి రెండు గేదెలు మృతి చెందాయి. నువ్వు, జీడి మామిడి, మామిడి పంటలకు మాత్రం నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. విశాఖ జిల్లాలో చిరుజల్లులు పడ్డాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రైల్వేస్టేషన్ రోడ్డు నీట మునగడంతో రెండు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. కోనసీమ జిల్లా అమలాపురం, అంబాజీపేటలో కురిసిన వర్షాలకు వరిచేల్లోకి నీరు చేరింది. కాకినాడలో కచేరిపేట నీట మునిగింది.

తిరుపతి జిల్లా సోమలలో నీట మునిగిన కర్బూజా పంట

పారిశుధ్య కార్మికులపై కనికరం చూపాలి

- ప్రశ్నోత్తరాల్లో టిడిపి సభ్యులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని సిఆర్‌డిఎ ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని టిడిపి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఏలూరి సాంబశివరావు తెలిపారు. రాజధాని ప్రాంతంపై ప్రభుత్వానికి వున్న కక్షతో పారిశుధ్య కార్మికులకు 10 నెలలు అయినా వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. ఆదివారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో టిడిపి సభ్యులు మాట్లాడారు. సిఆర్‌డిఎ పరిధిలోని పారిశుధ్య కార్మికులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వున్న కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. ఈఎస్‌ఐ. పిఎఫ్ లాంటి పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. వారికి వచ్చేది తక్కువ వేతనం అయినా ప్రభుత్వ ఉద్యోగులని రేషన్‌కార్డులు, ప్రభుత్వం ఇచ్చే గృహనిర్మాణ పథకాలు, చివరకు కుటుంబంలో ఎవరికైనా సామాజిక పింఛన్లు వస్తున్నా నిలిపేశారని పేర్కొన్నారు. చిరుద్యోగులపై ఈ చర్య తగదని అన్నారు. సిఆర్‌డిఎ పరిధిలో 2017లో 430 మంది పారిశుధ్య సిబ్బంది వుంటే అమరావతి మీద వున్న అక్కసుతో ఉద్యోగులను తగ్గిస్తున్నారని అన్నారు. ఇందుకు మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సమాధానం చెబుతూ పారిశుధ్య పనులను చేయిస్తున్న ఏజెన్సీ కాలపరిమితి ముగిసిందని, కొత్తగా టెండర్లను పిలిచామని త్వరలో ఫైనలైజ్ చేస్తామని అన్నారు. ఈఎస్‌ఐ, పిఎఫ్‌లకు సంబంధించి ప్రభుత్వానికి సంబంధం లేదని ఏజెన్సీలే చెల్లించాలని తెలిపారు.

మూడేళ్లుగా కాల్వకు మరమ్మతు లేదు

2020లో వచ్చిన వరదల్లో తూర్పు గోదావరి జిల్లాలో దబ్బాక కాలువ దెబ్బతిందని, మూడేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలుగుదేశం ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. దబ్బాక కాలువపై కట్టమూరు నుండి కాండ్రకోట హెడ్ రెగ్యులేటర్‌తో పాటు రెండు బ్రిడ్జీలు దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అధునీకరణ పనులు కూడా ముందుకు జరగడం లేదని అన్నారు. దీనిపై రాష్ట్ర జలవనరు లశాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వరదల్లో కాలువ దెబ్బతినగానే రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. అధునీకరణ పనులకు టెండర్లను పిలిచామని త్వరలో పనులు చేపడతామని తెలిపారు.

ఎరువుల కోసం గోడౌన్లను నిర్మించాలి

రాష్ట్రంలో ఎరువుల లభ్యత వున్నా గోడౌన్లు తగినన్ని లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైసిపి ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, గొల్ల బాబురావు, పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆర్‌బికెలకు అనుగుణంగా గోడౌన్లుంటే బాగుంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల సమస్య లేదనివ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆర్‌బికెలు, పిఎసిఎస్‌ల ద్వారా అందిస్తున్నామని పేర్కొన్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర

రాష్ట్రంలో మామిడి రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వైసిపి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ ప్రయోగశాలలు అనే ప్రశ్నలో భాగంగా ఆయన మామిడి రైతుల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతపురంలో మామిడి రైతులు గిట్టుబాటు లేక నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మామిడి రైతులతోపాటు ప్రతి పంటకూ గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రైతులను ఆదుకుంటాం

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ చెప్పారు. ఆదివారం సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు, బీమా కల్పిస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అకాల వర్షాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించారని చెప్పారు. వారం రోజుల్లో పంట నష్టం అంచనాలు పూర్తి చేసి నివేదిక అందించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఐదు జిల్లాల్లో 25 మండలాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమిక అంఛనాను ప్రభుత్వానికి అందించారని అన్నారు. అత్యధికంగా నంధ్యాల జిల్లాలో 15 మండలాల్లో మొక్కజొన్న, వరి, మినుము, మిర్చి, పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. కర్నూలు జిల్లాలో ఒక మండలం, పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు మండలాలు, ప్రకాశం జిల్లాలో ఒక మండలంలో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు.

ఏడు స్థానాలూ గెలుస్తాం : మంత్రి కారుమూరు

ఎమ్మెల్యేల కోటాలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాలను వైఎస్సార్‌సిపి కైవసం చేసుకుంటుందని మంత్రి కారుమూరు నాగేశ్వరరావు తెలిపారు. ఏడు స్థానల్లో గెలవడానికి తగిన సంఖ్యాబలం తమకు ఉందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సిపి అభ్యర్థుల ఓటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఎటువంటి ప్రభావమూ చూపదని, వైఎస్సార్‌సిపినే తిరిగి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాటూరు రామయ్య అభిప్రాయాలతో పార్టీకి సంబంధం లేదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం సీనియర్ నాయకులు పాటూరు రామయ్య ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ విధానాలను కొనియాడుతూ చేసిన ప్రకటనలతో తమ పార్టీకి ఎటువంటి సంబంధమూ లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. శనివారం వై వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం మీడియాలో రామయ్య వ్యాఖ్యానించిట్లుగా వచ్చిన వార్తలపై స్పందించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామయ్య వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయాలనీ, ఈ సందర్భంగా మహనీయుడు సుందరయ్య పేరును దుర్వినియోగం చేయడం సరైంది కాదనీ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం భావించిందని పేర్కొన్నారు. కేంద్రంలో మోడీ విధానాలకు వంత పాడుతూ రాష్ట్ర అభివద్ధిని, ప్రజా సంక్షేమాన్ని దెబ్బకొడుతున్న వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం తన పోరాటాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

దీక్షలో కూర్చున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటాలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటాలే మార్గమని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 766వ రోజుకు చేరాయి. దీక్షల్లో హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్) కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వ ప్రకటనల నేపథ్యంలో పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు స్పష్టం చేశారు. హెచ్‌ఎంఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతి రెడ్డి, దొమ్మేటి అప్పారావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో శాశ్వత కార్మికులతోపాటు కాంట్రాక్ట్ కార్మికులు సైతం భుజం భుజం కలిపి పని చేస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు ఆపద వస్తే ముందుగా నష్టపోయేది కాంట్రాక్ట్ కార్మికులేనని అన్నారు. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి కర్మాగారాన్ని కాపాడుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు గొడ్డు రమణ, జి.సత్యారావు, ప్రభు కుమార్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయి

- వ్యవస్థలను మ్యానేజ్ చేయడం చంద్రబాబుకు అలవాటే
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డి అన్నారు. పలువురు అధికారుల తీరుపై అనుమానాలు ఉన్నాయన్నారు. వ్యవస్థలను మ్యానేజ్ చేయడం చంద్రబాబునాయుడుకు వున్న అలవాటేనని విమర్శించారు. ఆదివారం సెక్రటేరియట్లో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో వున్నప్పుడు చంద్రబాబునాయుడు వ్యవస్థలన్నింటినీ తొక్కిపెట్టారని అన్నారు. గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిందని తెలిపారు. 8వ రౌండ్ కౌంటింగ్‌లో ఒక్క బండిల్‌లోనే ఆరు ఓట్లు తేడాగా కనిపించాయని అన్ని బండిల్స్‌ను చూస్తే వాస్తవం వెలుగులోకి వస్తుందన్నారు. వైసిపి ఓట్లను టిడిపిలోకి కలిపారని అన్నారు. రీ కౌంటింగ్ కోరడం అభ్యర్థి హక్కని అన్నారు. తెలుగుదేశం పార్టీ వైరస్ లాంటిదని, అన్ని వ్యవస్థలరూ ఆ వైరస్ పాడు చేస్తుందని విమర్శించారు. అధికారులపై ఒత్తిడి తెస్తే రిజల్ట్ ఇలా ఎందుకు వస్తుందన్నారు. తెలుగుదేశం తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. తమ పార్టీ ఎప్పుడూ ధర్మయుద్ధమే చేస్తుందని అన్నారు. చంద్రబాబునాయుడు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అనే వాళ్లు 175 స్థానాల్లో అభ్యర్థులను నిలుపుతామని ఎందుకు చెప్పడం లేదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వైసిపి అభ్యర్థి, ఏజెంట్లుగా ఉన్న కార్యకర్తలు మాత్రమే వెళితే టిడిపి నుండి పెద్దపెద్ద నాయకులు వెళ్లారని తెలిపారు. వారు ఓట్లను తారుమారు చేశారని అన్నారు. తెలుగుదేశం హయాంలో ఎ బి వెంకటేశ్వరావు లాంటి వారిని ఉపయోగించి ఎన్ని అక్రమాలు చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో వున్నా మా హక్కుల కోసం మేం పోరాడాల్సి వచ్చే పరిస్థితిని చంద్రబాబునాయుడు సృష్టించారని అన్నారు. దబాయించడం, బూతులు తిట్టడం, తీవ్రమైన ఆరోపణలు చేయడం చంద్రబాబునాయుడికి అలవాటని అన్నారు. కుప్పంలో వైసిపి కొట్టిన దెబ్బ నుంచి తెరుకోలేక పులివెందులలో విజయం అంటూ చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో మూడు జిల్లాలు కలిపి కౌంటింగ్ చేస్తారని పులివెందుల ఓట్లు అని చెప్పుకోవడం దివాళాకోరుతనమని అన్నారు.

డిక్లరేషన్ జారీలో జాప్యంపై టిడిపి, పిడిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా గెలుపొందిన భూమిరెడ్డి రాంగోపాలరెడ్డికి ఎన్నిక ధృవపత్రం ఇవ్వకుండా జాప్యం చేయడాన్ని నిరసిస్తూ శాసన మండలిలో టిడిపి, పిడిఎఫ్ సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. చర్చకు పట్టుబట్టారు. ఎన్నికలకు సంబంధించిన అంశం ఎన్నికల సంఘం వద్దకు వెళ్లాలని మండలికి సంబంధం లేదని ఛైర్మన్ కొయ్యే మోషెన్ రాజు ప్రకటించారు. ఎన్నిక అయిన సభ్యుడికి సంబంధించిన హక్కులను మాత్రమే మండలి చర్చిస్తుందన్నారు. అయినా టిడిపి సభ్యులు గట్టిగా నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం చుట్టుముట్టారు. పోడియంపైకి వెళ్లి నిరసన తెలపడంతో సభను ఐదు నిమిషాలు వాయిదా వేస్తున్నట్టు ఛైర్మన్ ప్రకటించారు. అంతకు ముందు మండలిలో ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఏ అంశాన్ని అయినా చట్టసభలో చర్చించవచ్చన్నారు. అనంతరం ఎన్నిక ధృవపత్రం ఇచ్చారని సమాచారం రావడంతో సభ్యులు తదుపరి కార్యచరణను ఉపసంహరించుకున్నారు.

యావజ్జీవితం ప్రజలకే అంకితం

(మొదటిపేజీ తరువాయి)

బలహీనం అవ్వడం వలనే రివర్స్ భూ సంస్కరణలు అమలవుతున్నాయన్నారు. ఈ రోజు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పక్కన పెట్టి దేశంపై మనువాదాన్ని రుద్దేంతుకు ప్రయత్నిస్తోందన్నారు. అమృత మహోత్సవాలు పేరుతో ఆదానీలకు కార్పొరేట్లకు అమృతాన్ని, సామాన్యులకు గరళాన్ని కేంద్ర ప్రభుత్వం పంచుతోందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూములను ప్రభుత్వం ఆదానీకి అప్పగిస్తోందన్నారు. తిరోగమనంలో నడుస్తున్న దేశాన్ని పురోగమనంలో నడపడానికి మల్లు స్వరాజ్యం పోరాటాలు ఈ రోజు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. రాజకీయాలు, సామాజికంగా వస్తున్న మార్పులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లో డబ్బుతోపాటు కులం సమాజంలో పెద్ద ఎత్తున ప్రభావితం చూపుతోందన్నారు. ఈరోజు కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీనపరచడానికి కులతత్వాన్ని సాధనంగా వాడుతున్నారన్నారు. ఈ అంశాలపై నంబూద్రిపాద్ కేరళలో అధ్యయనం చేశారన్నారు. వర్గపోదోపిడితోపాటు, సామాజిక దోపిడికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకతను తెలియజేశారన్నారు. కమ్యూనిస్టులు మత సంస్థలతో పొత్తులకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారన్నారు. కులాలు మతాలకు అతీతంగానే తెలంగాణాలో పోరాటం సాగిందన్నారు.. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఆనాటి కమ్యూనిస్టు నాయకుల త్యాగాలు , ఆచరణాత్మక జీవితాలను ఈ తరం నాయకులు అలవర్చుకుని కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అసవరం ఉందన్నారు.

'అదానీ బుడగ' పుస్తకావిష్కరణ

ఈ సందర్భంగా సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురించిన పేలిపోతున్న ఆదానీ బుడగ పుస్తకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు పి మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తమానంలో మనముందున్న కర్తవ్యాలను నెమరవేసుకోవడానికి మహనీయుల సంస్మరణ సభలు ఉపయోగపడతాయన్నారు. ఎఎల్‌సి, గ్రాడ్యుయేట్ ఎన్నికలను పరిశీలిస్తే పోరాటాలకు, ఉద్యమాలకు మంచి రోజులు వస్తున్నాయని తెలుస్తోందన్నారు. ప్రజలను మభ్యపెట్టి పాలించాలనుకుంటున్న ప్రభుత్వాలు ఆటలు సాగవని స్పష్టం అవుతోందన్నారు. తొలుత సభలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు పి. మధు, మల్లు స్వరాజ్యం చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

పంటనష్టం అంచనా వేయండి

- అకాల వర్షాలపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట నష్టపరిహారంపై వెంటనే అంచనా మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో పంట నష్టం అంచనా పూర్తిచేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అకాల వర్షాలపై ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు, వివిధ ప్రాంతాల్లో పంటలకు జరిగిన నష్టంపై ప్రాథమిక సమాచారాన్ని అధికారులు సిఎంకు అందించారు. అంచనా పూర్తయ్యాక రైతులను ఆదుకునేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భారీ వర్షాల వల్ల ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు కూడా తీసుకోవాలని తెలిపారు. .

రైతులను ఆదుకోవాలి : చంద్రబాబు

రాష్ట్రంలో ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు రెండు లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు తెలియజేస్తున్నాయని వెల్లడించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేలపై నిఘా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసెంబ్లీ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఇంటెలిజెన్స్ నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఒక్కో మంత్రికి 22 మంది ఎమ్మెల్యేలను కేటాయించిన ప్రభుత్వం మాక్ పోలింగు కూడా నిర్వహించింది. ఎన్నికల ముందు రెండు రోజులు సెలవు ఉండటంతో ప్రతిపక్షం ఏమైనా ప్రలోభాలకు గురిచేస్తుందనే సందేహంతో మంత్రులతో సహా ఎమ్మెల్యేలనూ పూర్తి నిఘా పరిధిలోకి తీసుకొచ్చారు. పూర్తి కదలికలపై నివేదికను పంపించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన సమీక్షలో ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వబోమని సిఎం ప్రకటించారు. అసమ్మతితో ఉన్నవారు టిడిపితో కుమ్మక్కు అవుతారేమోనని ప్రభుత్వం ఇప్పటి నుండే జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి లాంటి వారు ఆత్మప్రబోధానుసారం ఓటు వేస్తామని చెప్పడంతో గందరగోళం నెలకొంది. అసెంబ్లీలో జరిగే ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్సీ విజయం సాధిస్తే రాజకీయంగా అధికారపార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లు అవుతుంది. దీంతో అసెంబ్లీలో 23న పోలింగు జరిగే వరకూ ఎమ్మెల్యేలపై పూర్తి నిఘా ఏర్పాటు చేసింది. కర్నూలుకు చెందిన ఎమ్మెల్యేపై నిఘా కోసం సిఐ స్థాయి అధికారిని నియమించినట్లు తెలిసింది.

మూడు బిల్లులకు ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో ఆదివారం మూడు బిల్లులను ఆమోదించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ (అమెండ్‌మెంట్) బిల్లు-2023, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ (అమెండ్‌మెంట్) బిల్లు -2023ని మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రవేశపెట్టారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ డాటెడ్ ల్యాండ్స్ (అప్‌డేషన్ ఇన్ రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్) బిల్లు సవరణ-2023, ఆంధ్రప్రదేశ్ రైట్స్ ఇన్ ల్యాండ్ పట్టాదారు పాస్‌బుక్స్ (అమెండ్‌మెంట్) బిల్లు-2023, ఆంధ్రప్రదేశ్ ఇనామ్స్ అబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్‌టూ రైతువారీ (అమెండ్‌మెంట్) బిల్లు -2023ను శాసనసభ ఆమోదించింది.

పట్టభద్రులే భవిష్యత్‌కు మార్గదర్శకులు : పవన్

రాష్ట్ర భవిష్యత్‌కు పట్టభద్రులే మార్గదర్శకులని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తేలతెల్లం చేశాయన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారం తలకెక్కిన వైసిపి నేతలకు పట్టభద్రులు తమ ఓటు ద్వారా కనువిప్పి కలిగించారని తాము భావిస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అథోగతిపాలు చేస్తున్న తీరును పట్టభద్రులు తమ ఓటు ద్వారా నిరసించారని పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రజాకంఠకపాలనకు వ్యతిరేకంగా ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ, విజేతలకు పేరుపేరునా అభినందనలు తెలిపారు.

రాములోరి కల్యాణానికి 31లోగా ఏర్పాట్లు పూర్తి : ఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం కలిసి ఈ నెల 31 నాటికి శ్రీ సీతారాముల స్వామివారి కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి సూచించారు. శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కడప కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శ్రీసీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కల్యాణానికి వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ గత ఏడాది 3,500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను టిటిడి ఇఒ ఆవిష్కరించారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, జెసి సాయికాంత్‌వర్మ, ఎస్‌విబిసి సిఇఒ షణ్ముఖకుమార్, టిటిడి సిఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఉసురు తీస్తున్న మోడీ

ఎపిఆర్‌పిఎ రాష్ట్ర మహాసభలో ఎఐసిసిఇపిఎఫ్‌పిఎ జాతీయ ప్రధాన కార్యదర్శి ధర్మజన్

అభివాదం చేస్తున్న నూతన రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ అనుసరిస్తోన్న విధానాల కారణంగా దేశంలో ఇపిఎఫ్ పెన్షనర్లకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇపిఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ (ఎఐసిసిఇ పిఎఫ్‌పిఎ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ధర్మజన్ అన్నారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) 2వ రాష్ట్ర మహాసభ ఆదివారం కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎ.శాస్త్రి అధ్యక్షత జరిగిన సభలో కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన ధర్మజన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇపిఎఫ్ పెన్షనర్ల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణితో ఉందన్నారు. ఒక పక్క కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. వివిధ రకాల పన్నుల పేరుతో పేదల నడ్డి విరుస్తోందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని తక్షణమే అధికారం నుంచి గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఆలిండియా ఉపాధ్యక్షుడు అతుల్ దిగే, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్‌రావు, కోశాధికారి సిహెచ్.సత్యనారాయణ రాజు, రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం తదితరులు మాట్లాడారు.

పెన్షన్ ఎవరి బిక్షా కాదని, ఉద్యోగుల హక్కు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇస్తున్నందున, ఇపిఎఫ్-95 పెన్షనర్లకూ ఇదే మాదిరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. రెండు సంవత్సరాల వెయిటేజీ, భార్యాభర్తలకు కూడా మెడికల్ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ఎస్.శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా కె.సత్తిరాజు, కోశాధికారిగా సిహెచ్.సత్యనారాయణరాజులతోపాటు 44 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడింది. ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు మంజూరు చేయాలని, హయర్ పెన్షన్ ఆప్షన్‌ను అందరి పెన్షనర్లకు అనుమతించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి డిఎలు చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ సంఘాలను నియమించాలని, వృద్ధులకు ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని తీర్మానాలు చేశారు.

లౌకిక వాదులు మౌనం వీడాలి

- ఆవాజ్ సదస్సులో గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

బిజెపి పాలనలో ప్రజాస్వామ్య పరిరక్షణకు విఘాతం కలుగుతోందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం లౌకికవాదులంతా మౌనం వీడాల్సిన అవసరం ఆసన్నమైందని ఆవాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ అన్నారు. 'మతోన్మాదం- ప్రజాస్వామ్యం' అంశంపై కర్నూలు మౌర్య ఇన్ వద్ద ఇంటర్నేషనల్ హాల్లో ఆదివారం సదస్సు జరిగింది. ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎ సుభాన్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో గఫూర్ మాట్లాడుతూ లౌకికవాదులంతా ఐకమత్యంగా లేకపోతే బిజెపి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో గెలిచేందుకు ముందస్తు ప్రణాళికలు వేసుకుందన్నారు. బిజెపి బలపడేందుకు ముస్లిములను, క్రైస్తవులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి జీవితాలతో ఆడుకుంటుందని చెప్పారు. చంద్రబాబు, జగన్, పవన్ బిజెపి చేతుల్లో కీలుబొమ్మలా ఉన్నారన్నారు. మనమంతా ఐక్యంగా ఉండి బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వాలు రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. వార్డు, గల్లి స్థాయి నుండి కమిటీలు ఏర్పాటు చేసుకొని సమావేశాలు నిర్వహించి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని, ప్రధానంగా యువకులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆవాజ్ ఓల్డ్ సిటీ కమిటీ గౌరవ అధ్యక్షులు ఇస్మాయిల్, నగర కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్, న్యూసిటీ నాయకులు ఎస్ఎండి రఫీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గుండెపోటు రాకుండా స్టెమీ భరోసా

- రూ.120 కోట్లతో కర్నూలు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాథ్‌ల్యాబ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుండెపోటు వచ్చిన తొలిగంట (గోల్డెన్ అవర్)లోనే అత్యాధునిక వైద్యం అందించేందుకు స్టెమీ (ఎస్‌టి ఎలివేషన్ మయోకార్డియల్‌ఇన్‌ఫ్రాక్షన్) విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానుందని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 9, ప్రైవేటు ఆసుపత్రుల్లో 91 క్యాథ్‌ల్యాబ్‌లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 53 ఏరియా ఆసుపత్రులు, 12 జిల్లా స్థాయి ఆసుపత్రులు ఉన్నాయన్నారు. మరో ఐదు చోట్ల క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు పరికరాలను రూ.120 కోట్లతో కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం డాక్టర్లు స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్టణం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం ఆసుపత్రులను హబ్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ఎంఎన్‌సిల దాడులను తిప్పికొడదాం

ఎపిఎంఎస్ఆర్‌యు జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎఫ్ఎంఆర్ఐ జాతీయ కార్యదర్శి భట్టాచార్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఎంఆర్ఐ జాతీయ కార్యదర్శి భట్టాచార్య

ప్రజాశక్తి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

మెడికల్ రిప్రజంటేటివ్‌లపై బహుళజాతి సంస్థల దాడులను తిప్పికొట్టాలని ఎఫ్ఎంఆర్ఐ (ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ కార్యదర్శి భట్టాచార్య అన్నారు. ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఎస్ఆర్‌యు) జనరల్ కౌన్సిల్ సమావేశం రెండో రోజు ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలోని టౌన్ హాల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు టివి.కోటేశ్వరరావు అధ్యక్షతన కొనసాగింది. ముఖ్యఅతిథిగా భట్టాచార్య పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు మందుల ధరలు అందుబాటులో ఉండేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని, మందులపై జిఎస్‌టి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తమ హక్కులను హరించే విధానాలను అవలంబిస్తోందని, వీటికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తమ హక్కుల కోసం న్యాయబద్ధమైన పోరాటం చేస్తోన్న ఎపిఎంఎస్ఆర్‌యు నాయకులను ఫార్మా కంపెనీలు సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడాన్ని ఇక నుంచి సహించబోమని సమావేశం స్పష్టం చేసింది. ఫైజర్, ఆస్ట్రాజనిక, గ్లాక్సో, నోవర్టిస్ వంటి బహుళజాతి సంస్థలు ఇటీవల మెడికల్ రిప్రజెంటేటివ్స్‌పై చేసిన దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకట్రావు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాషాయ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర కార్యదర్శులు చంద్రమౌళి, మనోహర్ తీర్మానాలను ప్రవేశపెట్టారు. వీటితోపాటు పలు తీర్మానాలను ఈ సమావేశం ఆమోదించింది. బహుళజాతి కంపెనీలు మెడికల్ రిప్స్‌పై నిర్దాక్షిణ్యంగా సాగిస్తున్న దాడులను సమావేశం ఖండించింది. విపరీతమైన పని భారం మోపడం మానుకోవాలని, చట్టవ్యతిరేక చర్యలు ఆపాలని డిమాండ్ చేసింది. పలు కంపెనీలు ఇదే ధోరణి అవలంబిస్తున్నాయని పేర్కొంది. కార్మిక వ్యతిరేక విధానాల పట్ల మెడికల్ రిప్స్ అంతా సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని సమావేశం పిలుపునిచ్చింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాల్లో మెడికల్ రిప్స్ భాగస్వాములు కావాలని కోరారు. జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన సౌహార్ద్ర సందేశమించ్చారు. మెడికల్ రిప్స్ పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఎపిఎంఎస్ఆర్‌యు ప్రధాన కార్యదర్శి యువి.కృష్ణయ్య మాట్లాడుతూ రానున్న రోజుల్లో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ కోశాధికారి దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం : లోకేష్

ప్రజాశక్తి-నల్లచెరువు

జోగన్నపేట వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం 47వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం మీదుగా సాగింది. నల్లచెరువు మండల పరిధిలోని తలమర్ల వాండ్లపల్లి పంచాయతీ చిన్నపల్లోల్లపల్లి విడిది కేంద్రం నుండి ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్రకు మాజీ ఎమ్మెల్యే, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె పార్థసారథి, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, టిడిపి నాయకులు కార్యకర్తలు, యువత స్వాగతం పలికారు. చిన్న ఎల్లంపల్లి వద్ద పాదయాత్ర 600 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం జోగన్నపేట వద్ద బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలని ఏర్పాటు చేయడం మాట అటుంచి ఉన్న పరిశ్రమలను వేరే రాష్ట్రాలకు తరుముతు న్నారని, కమీషన్ల కోసం వేధిస్తున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 90 శాతం హంద్రీ నీవా పనులు పూర్తి చేశామని మిగిలిన పది శాతం పనులు పూర్తిచేసి సాగునీరు అందించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఎకరానికి సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగం కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్యాణదుర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఎస్‌సిసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిల్లలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోక్సో చట్టం, పిల్లల లైంగిక వేధింపుల కేసులకు సంబంధించిన క్రమశిక్షణా కేసులపై సూచనలు చేస్తూ ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. పిల్లల లైంగిక వేధింపుల కేసుల కారణంగా సస్పెండయిన ఉపాధ్యాయులను విచారణ, ఇతర క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని తెలిపారు. ఇది న్యాయస్థానాల ఆదేశాలని, దీనిని గౌరవిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఓపిలు, పోస్టర్లు, వీడియో మాడ్యూల్స్ మొదలైన వాటి ద్వారా పిల్లలకు అవగాహన, సామర్థ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఎవరిని సంప్రదించాలి ? అలాంటి సంఘటనలకు ఎలా ప్రతిస్పందించాలి ? వంటి వాటిపై అవగాహన కల్పించాలని వెల్లడించారు. పోస్టర్లు, ఫిర్యాదు బాక్సులు ఏర్పరచడం, పాఠశాలలతో పాటు వాటి చుట్టుపక్కల ప్రదర్శించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175
బహిరంగ ప్రకటన
యూనిమని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌చే తనఖా పెట్టినబంగారు ఆభరణాలవేలం 22.03.2023, 10.00 AM వద్ద No. 3-6-2-/1, Ground Floor Grandpas Royal Mansion, Liberty Jn., Himayatnagar, Hyderabad - 500029. వద్ద జరుగుతుందనిఇందుమూలంగా ప్రజలకు తెలియచేయబడుతోంది. వేలం వేయబడేబంగారు ఆభరణాలు తమ బకాయిలుచెల్లించడంలో విఫలమైన వివిధ కస్టమర్ల ఋణ ఖాతాలకు చెందినవి. మా వేలంపాట నోటీసులు ఈ ఋణగ్రహీతలకు కూడా జారీచేయబడ్డాయి. వివిధ కస్టమర్ల వేలం వేయబడేబంగారు ఆభరణాలకు చెందిన గడువు తీరిన ఋణ ఖాతా బ్రాంచ్ పేరుతోక్రింద ఇవ్వబడింది.
Loan Nos: GUNTUR (GNR) -1971886, 1976444, 1976774, 1976849, 1973856, 1976920, 1972676, 1976361
For more details, please contact : **Mr. PRAVEEN NAIK - 9346463522**
(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175
బహిరంగ ప్రకటన
యూనిమని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌చే తనఖా పెట్టినబంగారు ఆభరణాలవేలం 22.03.2023, 10.00 AM వద్ద No. 3-6-2-/1, Ground Floor Grandpas Royal Mansion, Liberty Jn., Himayatnagar, Hyderabad - 500029. వద్ద జరుగుతుందనిఇందుమూలంగా ప్రజలకు తెలియచేయబడుతోంది. వేలం వేయబడేబంగారు ఆభరణాలు తమ బకాయిలుచెల్లించడంలో విఫలమైన వివిధ కస్టమర్ల ఋణ ఖాతాలకు చెందినవి. మా వేలంపాట నోటీసులు ఈ ఋణగ్రహీతలకు కూడా జారీచేయబడ్డాయి. వివిధ కస్టమర్ల వేలం వేయబడేబంగారు ఆభరణాలకు చెందిన గడువు తీరిన ఋణ ఖాతా బ్రాంచ్ పేరుతోక్రింద ఇవ్వబడింది.
Loan Nos: KHAMMAM (KHM) -1992507, 2002095, 2013253, 1997070, 1975351, 1958056, 1929166, 1939420, 1940672, 1974539, 1955622, 1971621, 1972279, 1988355.
For more details, please contact : **Mr. PRAVEEN NAIK - 9346463522**
(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

Format C-1
(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate : **PANCHUMARTHI ANURADHA**, resident of 1-83/1, PORANKI VILLAGE, PENAMALURU MANDAL – 521137, KRISHNA DISTRICT, ANDHRA PRADESH.

Name of political party : **TELUGU DESAM PARTY**

Name of Election : BIENNIAL ELECTIONS TO LEGISLATIVE COUNCIL 2023, Andhra Pradesh

Name of Constituency: **A.P. Legislative Council by the Members of Legislative Assembly Constituency**

I PANCHUMARTHI ANURADHA, a candidate for the abovementioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of case(s)	Sections(s) of Acts concerned and brief description of offence(s)
1	Hon'ble VI Addl. M.M. Court (Mobile Court) cum VI A.J.C.J. VJA	CC NO. 162/2020 In FIR No.722/2019, Penamaluru PS. Date 28-03-2023	For arguments.	U/S 341, 143, 188 r/w 149 of IPC. On 24-12-2019 the accused along with other accused formed themselves into unlawful assembly and staged a Dharna on NH 65 (Bandar) road at Poranki centre, Vijayawada by holding watchfires and raising slogans against the Govt. of AP and wrongfully restraint the movements of vehicular traffic and causing annoyance to the public peace and tranquility on the public road by disobeying the orders promulgated U/s.30 Police Act and Sec. 144 Cr.PC proceedings.
2.	Hon'ble Junior Civil Judge, Vuyyuru	CC No. 601/2020 In FIR No. 15/2020, Thotlavalluru PS. Date 03-07-2023	Await summons.	U/s 341, 143, 188 r/w 149 of IPC. On 07-01-2020 the accused along with other accused formed themselves into unlawful assembly by TDP workers on Krishna Karakatta, Totlavalluru Village and wrongfully restraint the traffic flow and paid deaf-ear to instructions to quit the place as 30 Police Act and 144 Cr.PC are in force and raising slogans against the Government.

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	**Maximum Punishment Imposed**
	NIL	NIL	NIL

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

Format C-2
(for political party to publish website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name of political party : **TELUGU DESAM PARTY**

* Name of Election : BIENNIAL ELECTIONS TO LEGISLATIVE COUNCIL 2023

Name of State/ UT : ANDHRA PRADESH

1	2	3	4		5		
Sl. No.	Name of constituency	Name of candidate	(A) Pending criminal cases		(B) Details about cases of conviction for criminal offences		
			Name of Court, case No. & status of the case(s)	Section of the Acts concerned & brief description of offence(s)	Name of Court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	**Maximum Punishment Imposed.**
1.	A.P. Legislative Council by the Members of Legislative Assembly Constituency	Panchumarthi Anuradha	Hon'ble VI Addl. M.M. Court (Mobile Court) cum VI A.J.C.J. VJA. CC NO. 162/2020 In FIR No.722/2019, Penamaluru PS. Date 28-03-2023. For arguments.	U/S 341, 143, 188 r/w 149 of IPC. On 24-12-2019 the accused along with other accused formed themselves into unlawful assembly and staged a Dharna on NH 65 (Bandar) road at Poranki centre, Vijayawada by holding watch fires and raising slogans against the Govt. of AP and wrongfully restraint the movements of vehicular traffic and causing annoyance to the public peace and tranquility on the public road by disobeying the orders promulgated U/s.30 Police Act and Sec. 144 Cr.PC proceedings.	NIL	NIL	NIL
			2. Hon'ble Junior Civil Judge, Vuyyuru. CC No. 601/2020 In FIR No. 15/2020, Thotlavalluru PS. Date 03-07-2023. Await summons.	U/s 341, 143, 188 r/w 149 of IPC. On 07-01-2020 the accused along with other accused formed themselves into unlawful assembly by TDP workers on Krishna Karakatta, Totlavalluru Village and wrongfully restraint the traffic flow and paid deaf-ear to instructions to quit the place as 30 Police Act and 144 Cr.PC are in force and raising slogans against the Government.			

'దురాగతాలను బహిర్గతంచేస్తూ, ఉన్నత నైతిక భావాలను వ్యాప్తి చేయడం కంటే- మిన్న అయిన లక్ష్యమూ, ప్రయోజనమూ సాహిత్యానికి వేరొకటి లేవు ..'' - గురజాడ

ఋతు సంగీతం

చెట్టు పాడే ఆకుపచ్చని పాటని
లే లేత నీడలోంచి
నిదుర లేచిన పిల్ల తెమ్మెర పిట్ట
ఊరంతా పంచి పెట్టింది
ఆహా! ఎంత పరవశం
మనసెంత పరిమళం
గాలికేం పనుంది?
ఎప్పుడూ మధురమైన బాణీలు కట్టి
ఇల్లిల్లూ తిరిగి హార్మోనియం మెట్లక్కి
నదుల్ని గదుల్లోకి తీసుకురావటమే కదా!
ఈ పక్షి సమీరం
ఎంత సంగీత సాధన చేసి సమ్రాట్టు అయిందో...
ఈ పాటను పట్టుకునే తూనీగలు
సీతాకోకలు మిణుగురులు చెట్లతో జతకట్టి
లోకాన్నంతా పలకరించడానికి బయల్దేరాయి
గాలికి వీటికీ పోటీ.
దేని అందం దానిదే.
దేని సంగీతం దానిదే.
ఎంతెంత ప్రవాహం!
ఎన్నెన్ని పరిమళాలు ఏమేమి జ్ఞాపకాలు.
ఎంత ప్రశాంతత. ప్రకృతి గొప్ప
కాస్ట్యూమ్ డిజైనర్.మిస్ ఋతు
ఈ ఏటికి కొత్త దుస్తులు తొడిగింది.
వగరు చిగురుమేసిన గ్రేట్ సింగర్ కోకిల వసంత
మరో కొత్త పాటని ట్యూన్ చేసి
ఈ లోకాన్ని సరికొత్తగా ఆలపిస్తూ
అభినందనలు పలికింది.
ఇంటింటికి పండుగను తెచ్చింది!
ఎన్నెన్నో ఆనందాలను పంచింది
కాలం నడుము వాల్చదు.
అలలకు కలలు ఉండవు.
ఎందుకంటే అవి నిద్రపోవు.
పగటి కలలు అసలే కనవు.
అవిశ్రాంత పోరాటమే దాని కల.
పాత దానిని వదిలి
నిత్య నూతనంగా చిగురులెత్తటమే
చీకటి తెరలను చీల్చుకుని
వెలుగు తారగా ప్రకాశించటమే
ఆకుపచ్చని ఋతు సంగీతం!

– శిఖా – ఆకాష్, 93815 22247

గాలి వాన

ఎన్నో కన్నీళ్లు, ఎంతో శ్రమ
ఎరువుగా వేసి పెంచుకున్న
కుసుమం
ఒక్క లీకు పురుగుతో
పూయకుండానే నేల రాలింది
పరిమళం మట్టిపొరల్లో
బొందపెట్టబడింది
చుట్టూ చెదపురుగులే చేరిపోయి
వ్యవస్థ కాండాన్ని కసిదీరా పీల్చేస్తుంటే
కలలు గిడసబారక ఏం జేస్తాయి?

ప్రతిదీ డబ్బుతోనే కొనగలమనే
అహంకారం వాడిదైతే
ప్రతిదీ అమ్మకానికే పెట్టగలం
అన్న అమాయకత్వం
ఆత్మాభిమానంలేని గొర్రెలదైతే

గెలుపులన్నీ ప్రాణపసలేని
తోలు తిత్తులుగాను
పరీక్షలన్నీ జీవితాల్ని తలకిందులు చేసే
చిత్తు కాగితాల్లానూ మిగిలిపోతాయి

మనుషులెప్పుడో మాయమైపోయి
నోట్ల కట్టల కిందపడి
మరణిస్తున్న నీతి సూత్రాలు
దారప్పోగుల్లా తెగిపోతున్న భవిష్యత్తు కలలు

కొనీ కొనీ వాడు కొండంత
పెరిగిపోతూనే వుంటాడు
అమ్ముకునీ అమ్ముకునీ
నీ ఒంట్లో అవయవాలు కూడా
మిగలని బేరానికి బలై
నువ్వే భూస్థాపితమైపోతావు

ప్రతిదీ అమ్మకపు సరుకైనచోట
జీవితాశల పున్నాగ పూలూ
లీకుల ఈదురుగాలికి
నేలరాలిపోతుంటాయి
ప్రతిదీ కొనగలమనే
ధీమా పరుచుకున్నచోట
మన వ్యక్తిత్వాలతో పాటు
మన ఒంట్లోని అవయవాలు కూడా
అంగడి సరుకులై
మన బతుకులే నిత్యం
ఓడిపోతూ వుంటాయి

అయినా, ఆఖరి ఆశల పూలనూ
నిలువరించగలిగే
ఇంకా కొన్ని పిడికిళ్లు
గాలిలోకి లేచే వున్నాయి
వందగొడ్లను తిన్న రాబందు కూడా
క్షణాల్లో రాలిపోయే గాలివానొకటి
రూపుకడుతూనే వుంది

– చిత్తలూరి కవిత్వం

ఏమీ లేవు ...!



ఒరేయ్ అబ్బాయి
మాకు పెద్ద పట్టింపులు ఏమీ లేవు
సిద్ధాంతం రాద్ధాంతం అసలే లేవు
పెద్దగా బాధపడేది లేదు!

ఒకరికి అధికారం కావాలి
మరొకరికి పదవి కావాలి
మనందరికీ డబ్బు కావాలి
ఇప్పుడు
ఎలుకను రక్షించమని
మనందరమూ పిల్లిని వేడుకోవాలి

కొందరం సంతోషపడాలి
గంపగుత్తగా మనందరం
గొర్రెలము కానందుకు ...!

(ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను చూసి ...)

– డా. ఎడ్ల కల్లేశ్
9866765126

ఉత్తరాంధ్ర అంతరంగ ఆవిష్కరణ 'చంపావతి'



ఇటీవల ఉత్తరాంధ్రలో రెండు అపురూప సాహిత్య సందర్భాలు జరిగాయి. అవి కళింగాంధ్ర గొంతును వినిపిస్తున్నాయి. ఒకటి 'రాజాం రచయితల వేదిక' ప్రచురణలలో గార రంగనాథం గారి సంపాదకత్వంలో 'విస్మృత కళింగాంధ్ర సాహిత్య ప్రభ' అనే 30 వ్యాసాల సంపుటి వెలువరించబడింది. రెండోది కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత 'బాల సుధాకర మౌళి' సంపాదకత్వంలో వచ్చిన 'చంపావతి-కళింగాంధ్ర సాహిత్య సంచిక' ఆవిష్కరణ.

మహానది నుండి గోదావరి నది మధ్య ఆవరించియున్న ప్రాంతాన్ని కళింగాంధ్రం అంటారు. ఈ ప్రాంతం ఆనాడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండేది. రాయగడ, పర్లాకిమిడి, బరంపురం ప్రాంతాలు ఒరిస్సా రాష్ట్రంలో కలిసాయి. ఆయా ప్రాంతాల్లో తెలుగు వాళ్లే అధికంగా ఉన్నారు. దాంతో కళింగాంధ్రలో అంతర్భాగమైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు (నేడు ఆరు జిల్లాలు) ఉత్తరాంధ్రగా మిగిలాయి. ఉత్తరాంధ్ర సహజ వనరులకు నిలయం. సువిశాల అటవీ, సముద్ర, మైదాన ప్రాంతాలు కలగలిపిన నేలతల్లి. ఈ నేలపై అనేక వీరోచిత పోరాటాలు జరిగాయి. ఇక్కడ జనం ఉద్యమ నేపథ్యం గలవారు. ప్రజా సాహితీ, సాంస్కృతిక ఉద్యమంలో విరివిగా పాల్గొన్నవారు. శ్రమను నమ్ముకునే వారు కావడంతో కాయకష్టం చేస్తూ జీవనం సాగిస్తారు. నేడు వీరిలో ఎక్కువ శాతం పట్టణాలకు వలసలు పోతున్నప్పటికీ, అక్కడ శ్రమే ఆయుధంగా జీవిస్తున్నారు.

ఉత్తరాంధ్ర ప్రజల జీవనశైలి విభిన్నం. గిరిజనులు, మత్స్యకారులు, మైదానవాసులు భిన్న ఆచార వ్యవహారాలు కలవారు. ఈ ప్రాంత మూలవాసులుగా ఉన్న వీరు తమ సంస్కృతీ సంప్రదాయాలను ఎల్లవేళలా కాపాడుకుంటూ వస్తున్నారు. కాకపోతే ప్రపంచీకరణ వీళ్ళ జీవనశైలికి విఘాతం కలిగిస్తూ సవాలు విసురుతున్నది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ ముసుగులో రాజ్యం ఈ ప్రాంతం పై దమనకాండ సాగిస్తున్నది. ఈ ప్రాంతవాసుల మనుగడను ప్రశ్నిస్తూ, కార్పొరేట్ శక్తులు తమ కార్యకలాపాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. వీరి ఆగడాలకు ముకుతాడు వేయాలి. అందుకు ఇచ్చట ప్రజలు ఐక్యం కావల్సిందే. అందుకు ఈ ప్రాంత కవులు, రచయితలు, మేధావులు నడుం బిగించాలి. ఈ క్రమంలోనే పైన ఉదహరించిన రెండు సాహిత్య సందర్భాలను నిర్వహించారు.

మౌళి ప్రచురించిన 'చంపావతి కళింగాంధ్ర సాహిత్య సంచిక' 44 పేజీల ఒక చిన్న పుస్తకం. ఒక పెద్ద ఆశయాన్ని భుజానికి ఎత్తుకొన్నది. ఆదిమ వాసులు వినియోగించిన సంగీత పరికరాల ఛాయాచిత్రాలను ఈ పొత్తంలో ఉంచారు. అలనాటి గిరిజనుల జీవన శైలికి ఈ చిత్రాలు అద్దం పడతాయి. మారుతున్న కాలంలో ప్రపంచీకరణ వల్ల గిరిజనులు వాటికి దూరం కావడాన్ని ఈ చిత్రాల ద్వారా మౌళి ఎరుకపరుస్తారు. ఇందులో 'గంటేడ గౌరునాయుడు' కవిత 'తూర్పు కెరటం' ఉంది. రైతు వేదనలను తన కవితలో హృద్యంగా పలికిస్తారు. నేటి కర్షకుల కష్టాలను కళ్ళముందు పెడతారు కూడా. 'కెక్యూబ్ వర్మ' తన 'భూస్వరం' కవితలో 'కళింగ సీమ ఇది/ అమాయకంగా కనిపించే/ ధిక్కార భూస్వరమిది' అని ఈ నేల ఉద్యమ నేపథ్యాలను ఉద్ఘాటించారు. 'ఆకలి గిన్నెలు' అనే 'మొయిద శ్రీనివాసరావు' కవితలో గతంలో జరిగిన నెల్లిమర్ల జ్యూట్ మిల్ కార్మికుల సమ్మె- దాని పర్యవసనాలను ఆర్ద్రంగా తడుముతూ, వారి ప్రాణ త్యాగాలను మననం చేశారు. 'పొట్టి రెక్కల పిట్ట కథ' అనే కవిత వర్ధమాన కవి కంచరాన భుజంగరావుది. సిక్కోలు ప్రజల చిందర వందర జీవితాలు, శిథిలమైన బతుకులు, వలస జీవన అష్ట కష్టాలు ఏకరువు పెట్టారు. 'నిన్నటి కవిత:ముద్ర'లో సుబ్బారావు పాణిగ్రాహి 'ఈ పాలన మనకెందుకు' అనే గేయ కవితను తీసుకున్నారు. ఐదు దశాబ్దాల క్రితం ఈ నేలపై సాగిన విప్లవోద్యమానికి తన జముకుతో ఊపిర్లు ఊదిన పాణిగ్రాహి, ఆనాటి పాలకుల దమననీతిని ఈ కవిత ద్వారా ఎండగడతారు. దాన్ని మౌళి పున్నశ్చరణ చేశారు. 'మిత్ర కవిత' పేరిట 'శివారెడ్డి' గారి 'నీలి కాగితం' ఉంచారు. ఉత్తరాంధ్ర తీర ప్రాంత వాసుల జీవితాలు సముద్రంలా అల్లకల్లోలమనీ, ఆ అలజడి కలకాలం ఉండదనీ, చివరకు ఏదో రూపాన స్వస్థత చేకూరగలదని ఆశాభావం వ్యక్తం చేస్తాడు కవి.

'బాల సాహిత్యం: చిటికెన వేని'లో పాయల సత్యనారాయణ గారి 'అమ్మో ఆడబతుకు, అక్కా బావా' కవితలను ఉంచారు. నేటికీ ఆడపిల్లలపై సమాజం, తల్లిదండ్రులు ఆంక్షలకు గురి చేయడం పట్ల ఖిన్నుడై విలపిస్తాడు కవి. స్త్రీ పడుతున్న ఇబ్బందులను దయనీయంగా స్పృశిస్తూ, తద్వారా సమాజం గతిని తూర్పారపడతారు. 'అనువాదాలు: ఇక్కడి గొంతు' శీర్షికలో మల్లిపురం జగదీష్, సిరికి స్వామినాయుడుల కవితలను 'మై డ్యూటీ, ది వెయిట్, మార్నింగ్' పేరిట మౌళి – సుందరం ఇంగ్లీష్ అనువాదం అందంగా కూర్పు చేశారు. 'కథ' శీర్షికన అట్టాడ అప్పల్నాయుడు 'సామంత రాజులు' అనే కథను ప్రచురించారు. ఈ కథ ఉత్తరాంధ్ర ప్రస్తుత రాజకీయ సమీకరణలను చూపుతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో రాజకీయంగా క్షత్రియ ప్రాబల్యం మెండుగా ఉండేది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అగ్రవర్ణాల ఆధిపత్యం విశాఖలో కొనసాగింది. నేడు ఉత్తరాంధ్రను మూడు ఎగువ వెనుకబడిన తరగతులు రాజ్యాధికారాన్ని వహిస్తున్నవి. అయితే వీరు చక్రవర్తి అడుగుజాడల్లో మెలిగే సామంత రాజులు మాత్రమే. వీరు అగ్రవర్ణ పాలకుల అడుగులకు మడుగులెత్తుతూ, వారి ఆదేశాలను శిరసావహిస్తూ ప్రతినిధులుగా ఉన్నారు. అంతే తప్ప వీరికి ఎటువంటి నిర్ణయాధికారం లేదు. ఈ ప్రాంతంలో ఏ ఒక్క అభివృద్ధి జరగాలన్నా, లేదా ఏ ఒక్క కార్యక్రమం రూపుదిద్దుకోవాలన్నా చక్రవర్తి కనుసన్నల్లోనే జరుగుతుంది. ఆ చక్రవర్తిని నడిపించే మరొక చోదకశక్తి ఒకటి ఉంటుంది. అది ఏం చెబితే అదే క్షేత్రస్థాయిలో అమలకు నోచుకుంటుంది. ఈ విషయాలను వివిధ పాత్రల ద్వారా, తగు సన్నివేశ రూపకల్పనలతో అట్టాడ తన కథలో వెల్లడించిన తీరు అభినందనీయం.

'సమీక్ష- స్పర్శ' శీర్షికన రైతు లేని కాలం మొదలైందనే ఆవేదనలో పుట్టినవే మాయ కథలు' అనే పుస్తక సమీక్షను డాక్టర్ ఆల్తి మోహనరావు రాయగా, దాన్ని ఈ బులిటన్‌లో నిక్షిప్తం చేశారు. ఈ మధ్యన మాయ కథలు మరోసారి పుస్తకంగా వచ్చాయి. ఈ కథల్లోని ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, విశ్లేషణాత్మకంగా సమీక్ష సాగింది.

ఈ చిట్టి పుస్తకంలో అట్టాడ వారి 'ముఖాముఖి' ఉంది. మౌళి జరిపిన ముఖాముఖి ఈ సంచికకు హైలెట్. అప్పల్నాయుడు కళింగాంధ్ర అస్తిత్వవాద గొంతుక. సందర్భం వచ్చినప్పుడల్లా తన వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఉత్తరాంధ్ర స్వరూప స్వభావాలను, సామాజిక, రాజకీయ ఉద్యమ నేపథ్యాలను ఎరిగినవారు. అందువల్ల నిర్మొహమాటంగా తన వేదనను వెలిబుచ్చారు. గుండెల్లో తూటాలు దిగినట్లు మాట్లాడారు. భౌగోళికంగా అనేక వనరులు గల ఈ ప్రాంతంలో సాహిత్య, సాంస్కృతిక వారసత్వం కూడా మెండుగా ఉంది. ఇక్కడ బహుజనులు ఎక్కువ. అయినప్పటికీ వారికి లభించే సహకారం స్వల్పం. ఈ ప్రాంతం ఎన్నో రకాలుగా వివక్షకు గురౌతున్నదని అట్టాడ అంటారు. అనేక సాహితీ ప్రక్రియలకు కన్నతల్లిగా ఈ నేలతల్లి పేరెన్నికగన్నది. ఇంతటి విశిష్ట ప్రాంతం నుండి వస్తున్న కళాకారులకు నేడు ఆదరణ కరువైంది. వారికి తగిన ప్రాధాన్యత ప్రభుత్వ సాహిత్య, సాంస్కృతిక సంస్థలు ఇవ్వడం లేదంటారు అట్టాడ. దీని నివారణకై ఇచ్చట కళాకారులు, మేధావులు ఏకం కావాలని ఈ ముఖాముఖి ద్వారా ఆశిస్తున్నారు. 'నడిచిన దారి' పేరిట కె.ఎన్ మల్లీశ్వరి గారి స్వగతాన్ని అచ్చువేశారు. తాను కథ పట్ల ఆసక్తి పెంచుకున్న తీరును ఆమె వివరించారు. తాను ముందుగా కవిత్వాన్ని రాశానని, తదనంతరం వచన ప్రక్రియల పట్ల ఆసక్తి పెంచుకున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా కథ, నవల నిర్మాణంలో తన పాత్ర ఉందంటారు.

ఈ పుస్తకంలో ఇటీవల ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆవిష్కరించబడిన కొత్త పుస్తకాల ముఖచిత్రాలు 'బహుళ' నవలతో పాటు చిటికెన వేలు, మాయ, అల్పపీడనం, నాలుగు రెక్కల పిట్ట, బాహుదా, చీకటి పువ్వు, దుర్ల, అరసేతిలో బువ్వపువ్వు, నిర్వేదస్థలం, ఆజిరి, బహుళం, విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ, తరగతి గది స్వప్నం పరిచయం చేసారు. తద్వారా కళింగాంధ్ర కవుల, రచయితల పట్ల మౌళి గౌరవం ప్రదర్శించారు. చందనపల్లి గోపాలరావు గీసిన ముఖచిత్రం బాగుంది. గతంలో రైతు సంఘీభావ సంచికగా 'చర్య' బులిటెన్‌ను ప్రచురించిన మౌళి, నేడు కళింగాంధ్ర సాహిత్య సంచిక 'చంపావతి'ని వెలువరించడం అభినందనీయం.

– పిల్లా తిరుపతిరావు
70951 84846

గౌరునాయుడు పాట .. వేకువ ఊట

ప్రముఖ కవీ, రచయిత, గాయకుడు గంటేడ గౌరునాయుడుకు పాటే ఊపిరి. నిజానికి మిగిలిన సాహితీవేత్తల కంటె ఆయనను భిన్నంగా ప్రత్యేకంగా చూపించేది పాటే... లిన్నెట్ పక్షి గొంతులోంచి ఉదయించిన వేకువ గౌరునాయుడి పాట... అలా పొలానికెళ్ళి గట్టు మీద కూర్చుని పొలంలో గొప్పు తవ్వుతున్న ఆడవాళ్ళ జానపద రాగాలను వింటున్నట్టుంటుంది ఆయన పాట వింటే. దేశభక్తిగీతమైనా.. అభ్యుదయ గీతమైనా.. పాటలో ఆయన శైలి అమితంగా మనల్ని ఆకర్షిస్తుంది .ఆద్యంతం హృదయాన్ని తాకి ఏదో అనుభూతికి అనుభవానికి లోను చేస్తుంది. కవిత్వం ప్రతి చరణంలోను ఉప్పొంగుతుంది. 'మా దేశం భారతదేశం .. నిరుపమాన త్యాగధనుల కలలకు ప్రతిరూపం.. మరల మరల జన్మిస్తాం ఈ నేలలో మరణమైన మధురమే తల్లి సేవలో..." అంటూ మనల్ని దేశం పట్ల ఈ మట్టి పట్ల ప్రేమ గౌరవాన్ని పెంపొందింపజేసే ప్రేరణ కలగజేసినా.. 'నా దేశ గత చరిత్ర నెత్తుటి మరక అయినా నా తల్లి మనసు మీగడ తరక' అంటూ మొదలై చిన్న పెద్ద అందరిలో దేశ స్వాతంత్ర్య చరిత్ర మననం చేసినా, ఆనాటి త్యాగాల పట్ల కృతజ్ఞత వ్యక్తపరచి నేటి మన బాధ్యతలు గుర్తుచేసినా అది గౌరు నాయుడు పాటలో అలవోకగా అమరిపోతుంది..

"పువ్వుల లోకం మాది చిరునవ్వుల లోకం మాది ఎల్లలు లేని కల్లలెరుగని పిల్లల లోకమిది బాలల మరో ప్రపంచమిది" అన్న పాట పిల్లల అమాయకమైన మనసును వారి కల్మషం లేని చిరునవ్వును ప్రతిబింబిస్తుంది. అందులోనే పిల్లల స్వేచ్ఛకు భంగం కలిగించే అంశాలను వ్యతిరేకిస్తారాయన. 'బండెడు బరువు పుస్తకాలతో వేయవద్దు సంకెళ్లు' అంటారు. అలాగే మరో గొప్ప పాట "విజ్ఞానంతోనే వికసించు జగత్తు పసిపిల్లల చదువే దానికి విత్తు" అంటూ మొదలవుతుంది. అందులో కూడా బాల్యం ఎలా విద్యను అభ్యసించాలి. పిల్లలకు ఎంత ప్రజాస్వామ్యయుతంగా చదువు నేర్పించాలన్న విషయాన్ని తెలియజేస్తుంది. "వ్యాపారం వలలో చదువు చేప కాకూడదు / కాసుల గాలానికి విద్యార్థులు బలి కాకూడదు" అంటూ ర్యాంకుల విద్యా విధానాన్ని నిరసిస్తారు. "పాఠమే పాటగా చదువే ఒక ఆటగా గురువే విద్యార్థికి చక్కని నేస్తంగా" ఉండాలని అలా ఉంటే 'తరగతి గదులే రేపటి తరగతి నిధులు' అన్న గొప్ప సందేశాన్ని సవివరంగా తెలియజేస్తారు. విద్య పట్ల ఆయనకున్న స్పష్టత ఆ పాటలో కనిపిస్తుంది. పిల్లల్ని ఎంతగా ప్రేమించకపోతే ఇలాంటి పాట రాయగలడు కవి!

అలాగే కష్టజీవుల శ్రమను మరిపించి వాళ్లకు ఉపశమనాన్ని ఇచ్చేది కూడా పాటే అన్న విషయాన్ని ఆయన పాట ద్వారానే తెలియజేస్తారు. 'పనికి తోడు పాట.. ఆ పాటకు సరి జోడు పని .. పనీపాట ఇద్దరూ కవల పిల్లలు"... అంటూ మానవ జీవన చైతన్యంలో, పరిశ్రమలో పాట ముందుండి నడిపించడాన్ని మనుగడ అవసరంగా పాటగానే వ్యక్తమౌతాడు. 'విచ్చుకుంటే పూలుగుప్పెడు.. అది అరకులోయ గుండె చప్పుడు".. లాంటి పాటల్లో సౌందర్య వర్ణన కూడా విభిన్న శైలిలో మనల్ని ఆకట్టుకుంటుంది

ఆయన సుమారు వెయ్యికి పైగా పాటలు రాసినా మనకు లభ్యమౌతున్నవి రెండు వందల వరకు ఉండొచ్చు. వీటితో పాటు గజళ్ళు కూడా రాసారు. అధికశాతం పాటలు అభ్యుదయాన్ని కాంక్షించేవే. పాటకు అంత్యప్రాస అందాన్ని తెస్తుంది.. గౌరునాయుడు గారి ప్రతి పాట అంత్య ప్రాసతో అలరారుతుంది. 'కమ్ముకుంది కాలుష్యం మండుతోంది భూగోళం/ గతి తప్పి తిరుగుతోంది గమ్మత్తుగ ఋతుచక్రం" అనే పాట మనిషి స్వార్థం వల్ల వాతావరణానికి జరుగుతున్న అనర్థాన్ని ఆందోళనతో కూడిన కళాత్మకతతో పాట కడతాడు. "తొలకరి మేఘం పాడదు చినుకుల రాగం/ తల్లి నేలకు తగ్గదు పగుళ్ళ రాగం".... పాటలో కూడా ఎక్కడా వచనంగా సాగిపోవడంతో రాజీ పడడు కవి. చివరికి ఆశతో ముగించడం పాట ప్రయోజనాన్ని మనం గమనిస్తాం

ఓ సినీ కవికార్యేషు దాసి కరణేషు మంత్రి భోజ్యేషు మాత.. శయ నేషు రంభ అన్న మాటలతో మొదలుపెట్టి 'అపురూపమైనది స్త్రీ జన్మ' అంటూ పాటనెత్తుకుంటే ఈ కవి మాత్రం ఆ మాటలే స్త్రీ పట్ల అవరోధాలని మనకు తెలియజేస్తాడు. అందుకే 'ఎవరిదీ మాట.. ఏ వంచన వైపు ఈ బాట/ ఏ కాలం నాటిది ఇంతుల కన్నీటి ఊట' అని చెబుతూ స్త్రీ మూర్తిని దోపిడీ చేయడానికే సాంఘిక న్యాయం లేని సమాజాన్ని స్త్రీ పక్షాన నిలబడి పాటలో ప్రశ్నిస్తాడు. అలా ఆయన పాటలో అభ్యుదయం కలిసి కదులుతుంది.

గౌరునాయుడు సరదాగా రాసిన పాటలు కూడా ఉన్నాయి. ఆర్టీసి బస్సులపై రాసిన పాట అందుకు ఉదాహరణ.. 'అదునుకు పనికి రాని అద్దోనం బస్సులు..' అంటాడాయన. 'ఒకదాని వెంట మరొకడు ఒకదాని వెంట ఒకటి వరస మీద వస్తాయి.. వేళా పాళా లేక వెర్రెత్తి తిరుగుతాయి/ ఆపితే ఆగవు ఆగితే కదలవు అవసరానికొక్కరికి ఆదుకోని బస్సులు..' .. ఇలా ఆర్టీసీ బస్సుల నిర్వాహకాలను చమత్కారంగా పాటలో వినిపించి హాస్యాన్ని పండించినప్పటికీ చివరి చరణంలో ఈ తీరు మారాలి ఆర్టీసి బస్సు ప్రజల కందుబాటు కావాలి అంటూ హితబోధ చేస్తారు.

అన్నీ 'పాడుదామా స్వేచ్ఛా గీత'మంత ఉధృతంగా జనంలోకి వ్యాపించి ఉండక పోవచ్చును గాని.... ఆయన చాలా పాటలు ప్రయోజనకరమైన పాటలు. ఎవరో ఒకరు ఎక్కడో ఒకచోట ఆ పాటల్ని పాడుతున్నప్పుడు మనం ఆ పాటల్లోకి లీన మైపోతాం. లీలగా మనగొంతు కూడా కలుపుతాం. ఏవో కొన్ని పాటలు చిన్న చిన్న మార్పులు చేయవలసినవి కూడా ఉంటే ఉండవచ్చు. వాటిని కూడా పరిశీలించి త్వరలోనే సమగ్ర సంకలనం తీసుకొస్తారని ఆశిద్దాం.

– పాయల మురళీకృష్ణ
83094 68318

అబద్ధం

బహుశా
ఇప్పుడు అబద్ధం అర్థం మార్చేసుకుంది
ఎవరూ తమ పిల్లలకు హరిశ్చంద్ర పేరు పెట్టడంలేదు
ఒకప్పుడు కనీసం కనబడేదైనా నిజమనిపించేది
మాటలు, చేతలు, దృశ్యాలు
అన్నింటినీ అబద్ధం కమ్మేసింది
వాడో వాగ్దానాన్ని గాల్లో విసురుతాడు
అది గాల్లో ఉండగానే వెనక్కి లాక్కొని వాడే మింగుతాడు
వీడో నిర్మాణాన్నీ కళ్ళముందు రూపుగడతాడు
కలలే కదా!
ధ్వంసమవ్వడానికి సమయమవసరం లేదు
మనుషుల మధ్య
బంధాలవ్వాల్సిన మాటలు
బాధ్యతలవ్వాల్సిన మాటలు
నమ్మకాలవ్వాల్సిన మాటలు
పలచబడి తేలిపోతున్నాయి
మాట బయటకు రాకుండానే
అక్షరాలు కత్తెర్లకు బలవుతున్నాయి
పదాలు అర్థాలను వలిచేసుకొని
విపరీతార్థాల నగ్నత్వంతో ఊరేగుతున్నాయి
మాటకు పూసిన పైపూత
క్షణాల్లో కరిగిపోయినా
నిజం చెప్పలేసుకోవడం
ఓ జీవితకాలం ఆలస్యమవుతోంది
ముక్కలు ముక్కలుగా అతుకులేసుకున్న దృశ్యాలు
నిజాలమీద నిప్పులు పోసి
చలికాసుకుంటున్నాయి
మేకప్పుల కప్పులతో మూసుకుపోయిన శరీరాలు
ఎవరికీ తమ లోపలి దేహాల్ని చూపడంలేదు
నిజం నీడల్లో సేదదీరాల్సిన నువ్వు
అబద్ధపు గాడ్పులే వాసంత సమీరాలనుకోవడమే
అతి పెద్ద విషాదం
ఎవరినైనా నమ్మించడం పెద్ద విషయమేమీ కాదు
కొనసాగించడమే అత్యంత క్లిష్టతరం
ఒక్కసారి నమ్మకం కోల్పోయాక
కట్టుకున్న అబద్ధపు మేడలన్నీ కుప్పకులాల్సిందే!

– బండ్ల మాధవరావు

ఎన్.గోపికి భారతీయ భాషా పరిషద్ పురస్కారం

కోల్‌కతాలోని భారతీయ భాషా పరిషద్ తెలుగులో ప్రముఖ కవి డా. ఎన్.గోపికి ప్రతిష్టాత్మకమైన కృతిత్వ సమగ్ర సమ్మాన్ పురస్కారాన్ని ప్రకటించింది. అవార్డు ప్రదానోత్సవం (అలంకరణ్ సమారోహ్) ఏప్రిల్ 8, 2023 సాయంత్రం 4 గంటలకు కోల్‌కతాలోని పరిషద్ సభాగారంలో జరుగుతుంది. పురస్కారం కింద లక్ష రూపాయల నగదు, అంగవస్త్రం, సైటేషన్‌లను బహూకరిస్తారు. 2020 మార్చిలో జరగాల్సిన ఈ కార్యక్రమం కరోనా కారణంగా మూడేళ్లు ఆలస్యంగా జరుగుతుంది. ఈ మేరకు పరిషద్ అధ్యక్షురాలు డా. కుసుమ్ ఖేమాని ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లెతీగ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు

నవ్యాంధ్ర రచయితల సంఘం-మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం, ఉగాది పండుగల సందర్భంగా మార్చి 21న మంగళవారం విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయం ఆడిటోరియంలో 'ఉగాది ఉత్సవాలు' జరుపుతున్నామని కార్యక్రమనిర్వాహణ కమిటీ సభ్యులు కలిమిశ్రీ, యేమినేని వెంకట రమణ, డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, కుర్రా సురేష్ బాబు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఉగాది కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు, కవులు, రచయితలు, కళాకారులకు ఉగాది సత్కారాలు, పుస్తకావిష్కరణలు వుంటాయి. ముఖ్య అతిథిగా గజల్ మాస్ట్రో డా. గజల్ శ్రీనివాస్ పాల్గొంటారు. అతిథులుగా మందపాటి శేషగిరిరావు, జి.లక్ష్మీనరసయ్య, కరుమారి దాసు, ఆర్.ఆర్. గాంధీ నాగరాజన్, టి. జమలాపూర్ణమ్మ, అరసవల్లి కృష్ణ, డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, కొల్లూరి పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, మందరపు హైమవతి, అమూల్య చందు, డాక్టర్ ఘంటా విజయ్ కుమార్, సరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్, రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, తంగిరాల సోనీలకు మల్లెతీగ ఉగాది పురస్కారాలు అందజేస్తారు. కవి సమ్మేళనంలో పాల్గొనాలనుకునే కవులు 8332903156 నెంబరులో సంప్రదించవచ్చు.

పెన్నా సాహిత్య పురస్కారం 2022

పెన్నా సాహిత్య పురస్కారానికి 2022 సంవత్సరానికి దాదాపుగా 40 కవితా సంపుటాలు వచ్చాయి. వాటిలో 2022 పెన్నా సాహిత్య పురస్కారానికి డాక్టర్ సుంకర గోపాలయ్య రచించిన 'మా నాయన పాట' కవితా సంపుటి ఎంపికైంది. న్యాయ నిర్ణేయతలుగా మేడిపల్లి రవికుమార్, మందరపు హైమావతి వ్యవహరించారు. త్వరలో జరగబోతున్న పెన్నా సాహిత్య పురస్కార సభలో వారికి నగదు బహుమతి మరియు పురస్కారాన్ని అందజేస్తాము.

– అవ్వారు శ్రీధర్ బాబు, అధ్యక్షుడు,
పెన్నా రచయితల సంఘం

అమర్త్యసేన్‌కు విశ్వ భారతి మరోసారి నోటీసులు

కొల్‌కతా : భూ అక్రమణ ఆరోపణలపై నోబెల్ సాహిత్య అవార్డు గ్రహీత అమర్త్యసేన్‌కు విశ్వ భారతి యూనివర్శిటీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆక్రమించుకున్న భూమి నుంచి ఎందుకు తొలగించకూడదో సమాధానం ఇవ్వాలని అమర్త్యసేన్‌ను తాజా నోటీసుల్లో కోరింది. ఈ నోటీసుకు ఈ నెల 24లోగా సమాధానం ఇవ్వాలని, ఈ నెల 29లోగా వ్యక్తిగతంగానూ లేదా ప్రతినిధి ద్వారా యూనివర్శిటీ జాయింట్ రిజిస్ట్రార్, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్ మహతో ముందుకు హాజరు కావాలని తెలిపింది. శాంతినికేతన్ క్యాంపస్‌లో భూమిని అమర్త్యసేన్ అక్రమంగా ఆక్రమించుకున్నారని కొన్నేళ్లుగా విశ్వ భారతి అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను అమర్త్యసేన్ ఖండిస్తున్నా నోటీసులు పంపుతూనే ఉన్నారు. ఈ భూమిపై సంయుక్త సర్వే నిర్వహించాలని అమర్త్యసేన్ కోరుతున్నారు.

అదానీ చర్యలన్నీ పారదర్శకమే : ఎన్‌ఎస్‌ఇ క్లీన్‌చిట్

న్యూఢిల్లీ : అదానీ ఎంటర్‌ప్రైజెస్‌తో సహా అదానీ గ్రూపులోని అన్ని సంస్థల లావాదేవీలు, చర్యలు పారదర్శకంగా ఉన్నాయని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ) స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం మూడు పేజీల ప్రకటనను విడుదల చేసింది. వ్యక్తిగత షేర్లపై అదానీ నిఘా చర్యలు, నిఫ్టీ సూచీల్లో షేర్లను చేర్చడం లేదా మినహాయించడం వంటి నిర్ణయాలు పారదర్శకంగా ఉన్నాయని, మానవ విచక్షణతోనే నిర్వహించినట్లు స్పష్టమవుతుందని తెలిపింది. ఈ ఏడాది జనవరి 31తో ముగిసిన గత ఆరు నెలల కాలవ్యవధికి సంబంధించిన ట్రేడింగ్ డేటా ఆధారంగా ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు తెలిపింది.

అకుంఠిత దీక్షతో 'మహా' ఉద్యోగుల సమ్మె

సర్కారు బెదిరింపులకు ఎదురొడ్డి ఆరు రోజులుగా పోరుబాట

ముంబయి : పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను పునరుద్ధరణ తదితర డిమాండ్లపై మహారాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అకుంఠిత దీక్షతో సమ్మె కొనసాగిస్తున్నారు. ఆరోరోజైన ఆదివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులతో సహా వివిధ శాఖలకు చెందిన సుమారు 17 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 14 నుంచి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు / అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, రాష్ట్ర సర్వీసుల్లో ఖాళీగా ఉన్న 2.75 లక్షల పోస్టులను భర్తీ చేయాలనే ప్రధాన డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు. సమ్మె చాలా ప్రభావవంతంగా సాగుతోందని, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకుంటే పరిస్థితి మరింత దిగజారుతుందని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున అకాల వర్షాల కారణంగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి అబ్దుల్ సత్తార్ అధికారుల్ని ఆదేశించారు. సమ్మె కారణంగా ప్రభుత్వ సేవలు దెబ్బతింటున్నా.. తమ డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి చొరవ తీసుకోవడం లేదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. శనివారం సాయంత్రం ఒపిఎస్ విధానంపై అధ్యయనం చేసేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, మూడు నెలల్లో నివేదిక అందజేస్తుందని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. సర్వీసు కాలంలో ఉద్యోగి మరణిస్తే, వారిపై ఆధారపడిన వ్యక్తికి కుటుంబ పింఛను సౌకర్యం కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్) కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే రూ.10 లక్షల కారుణ్య పరిహారం అందజేస్తున్నారు. దీనికి బదులుగా ఈ పెన్షన్ ఆప్షన్ ఎంచుకున్న కుటుంబానికి పరిహారం ఇవ్వకుండా కుటుంబ పింఛను అందజేయనున్నారు.

ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సమ్మెకు సిఐటియు సంఘీభావం

మహారాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెకు సిఐటియు ఆదివారం సంఘీభావం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదిరించి, అణచివేసేందుకు మహారాష్ట్ర ఎసెన్షియల్ సర్వీస్ మెయింటెనెన్స్ యాక్ట్ (మెస్మా)ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిరంకుశ చర్యను ఖండించింది. సుమారు 17 లక్షల మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్న మహారాష్ట్ర సమన్వయ్ సమితి సమ్మెకు పిలుపునిచ్చిందని, ఈ ఏడాది ఫిబ్రవరి 24న డిమాండ్ల చార్టర్‌తో సమ్మె నోటీసును ప్రభుత్వానికి సమర్పించిందని సిఐటియు గుర్తు చేసింది. బిజెపి కూటమికి చెందిన మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత పట్టించుకోకుండా, ఇప్పుడు మెస్మాను అమలు చేయడం ద్వారా సమ్మె చేస్తున్న ఉద్యోగులు, నాయకులపై విరుచుకుపడాలని నిర్ణయించుకుందని పేర్కొంది. ఈ ఆదేశాలను ధిక్కరిస్తూ మహారాష్ట్ర ఉద్యోగులు తమ సమ్మెను మరింత ఐక్యంగా కొనసాగిస్తున్నారని ప్రశంసించింది. మహారాష్ట్రలో విద్యుత్ ఉద్యోగుల సమ్మె, కిసాన్ లాంగ్ మార్చ్ విజయం సాధించినట్లే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా విజయం సాధిస్తారని సిఐటియు ధీమా వ్యక్తం చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తన అనుబంధ సంఘాలకు, కార్మికులకు సిఐటియు పిలుపునిచ్చింది.

క్యాన్సర్ చికిత్సపై అవగాహన అవసరం

- డాక్టర్ జి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్యాన్సర్ చికిత్సపై ప్రజలు అవగాహనను పెంచుకోవాలని మెడికల్ అంకాలజిస్ట్, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌లో కొలరెక్టల్ క్యాన్సర్‌కు సంబంధించి అధునాతన చికిత్సా విధానాలపై అవగాహన కార్యక్రమం (సిఎంఇ) జరిగింది. ప్రజల్లో కొలరెక్టల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన అంకాలజిస్టులు దాదాపు 500 మంది హాజరై చికిత్సా విధానంలో రోబోటిక్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీల పాత్రపై మాట్లాడారు. వైద్యవిధానంలో వచ్చిన కొత్త అంశాలపై చర్చించారు. కొత్త చికిత్సా విధానాలతో పాటు వచ్చే ఇబ్బందులను కూడా విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో కొలొరెక్టల్ క్యాన్సర్ సర్వసాధారణం అయ్యిందన్నారు. ఎక్కువ మంది ప్రజలు ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. సరైన అవగాహన లేకపోవడంతో పాటు రోగనిర్ధారణలో ఆలస్యం కారణంగా చాలామంది క్యాన్సర్ చివరిదశలో హాస్పిటల్స్‌కు వస్తున్నారని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, నిర్ణీత కాలానుగుణంగా పరీక్షలు చేయించడం ద్వారా ప్రజలు ఈ ప్రమాదం నుండి బయటపడొచ్చని అనేక పరిశోధనలు చెబుతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన సమయానికి భోజనం చేయడం, మద్యం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే కొలొరెక్టల్ క్యాన్సర్‌ను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో, సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వి ధర్మేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో కొలొరెక్టల్ క్యాన్సర్‌తో బాధపడే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ క్యాన్సర్ మూడో స్థానంలో వుంటే దేశంలో నాలుగో స్థానంలో వున్నామని తెలిపారు. ఈ క్యాన్సర్‌ను గుర్తించేందుకు అధునాతన స్క్రీనింగ్ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటి ద్వారా రోగిలో క్యాన్సర్ ఉందనే విషయాన్ని తొలినాళ్లలోనే తెలుసుకునే అవకాశం వుంటుందని అన్నారు. సకాలంలో గుర్తించి సరైన వైద్య విధానాలను పాటిస్తే ముందుగానే నయం చేయొచ్చని అన్నారు. క్యాన్సర్ వ్యాధి నిర్వహణలో శస్త్రచికిత్స ప్రధానమైనదని మణిపాల్ హాస్పిటల్‌లో లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీ వంటి అధునాతన సాంకేతిక పద్ధతులు అందుబాటు వున్నాయని తెలిపారు. రోగులు క్యాన్సర్ చికిత్స కోసం మణిపాల్‌లో అత్యుత్తమ వైద్య చికిత్స, సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ విజయవాడ డైరెక్టర్ డాక్టర్ కంటిపూడి సుధాకర్ మాట్లాడుతూ ఐఎంఎ, ఎపిఎంసి సహకారంతో కొలరెక్టల్ క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా వుందన్నారు. చికిత్సా విధానంలో వచ్చిన అధునాతన పద్ధతులను గురించి దేశంలోని సర్జన్లు, ఆంకాలజిస్టులు చర్చించుకోవడం కోసమే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. మణిపాల్ హాస్పిటల్‌లో రోబోటిక్ సర్జరీ, పెట్ సిటీస్కాన్ లాంటివి అందుబాటులో వున్నాయని తెలిపారు.

నేడు ఢిల్లీలో కిసాన్ మహాపంచాయత్

- 10 డిమాండ్ల సాధనకు పోరాటం
- హాజరుకానున్న లక్షలాది మంది రైతులు
- ఎస్‌కెఎం నేతల ప్రకటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ సర్కార్ నమ్మక ద్రోహం, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం కిసాన్ మహాపంచాయత్ నిర్వహించనున్నట్లు ఎస్‌కెఎం నేతలు ప్రకటించారు. ఆదివారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కెఎం నేతలు హన్నన్ మొల్లా, దర్శన్ పాల్, భూటా సింగ్, మేధా పట్కర్, ఆశిష్ మిట్టల్, సాహు తదితరులు మాట్లాడారు. పది డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరగనున్న కిసాన్ మహాపంచాయత్‌కు హాజరయ్యేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి లక్షలాది మంది రైతులు ఢిల్లీకి చేరుకున్నారని తెలిపారు. వ్యవసాయ ఆదాయం తగ్గడం, కార్పొరేట్ లాభం కోసం అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములు, అటవీ భూములు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులు, ఆదివాసీ రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ, వలస కార్మికులు, గ్రామీణ కార్మికులు, నిరుద్యోగం, పెరుగుతున్న జీవన వ్యయం, క్షీణిస్తున్న కొనుగోలు శక్తి అంశాలపై కిసాన్ మహా పంచాయత్‌లో లేవనెత్తుతామని తెలిపారు. 2021 డిసెంబర్ 9న ఎస్‌కెఎంకి లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్‌కెఎం నేతలు పునరుద్ఘాటించారు. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు, రైతులు తమ పంటలకు లాభదాయకమైన ధరలు పొందకపోవడం కారణంగా, దేశంలో 80 శాతం కంటే ఎక్కువ మంది రైతులు భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు బలవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎస్‌కెఎంతో చర్చించిన తరువాతే విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని రాతపూర్వక హామీ ఇచ్చిందని, ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిందని విమర్శించారు. వ్యవసాయ అవసరాల కోసం ఉచిత విద్యుత్, గ్రామీణ గృహాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నట్లు తెలిపారు. కరువు, వరదలు, వడగళ్ల వాన, అకాల వర్షాలు, పంటలకు వచ్చే తెగుళ్లు, అటవీ జంతువులు, విచ్చలవిడిగా పశువుల సంచారం కారణంగా రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను భర్తీ చేయడానికి, అన్ని పంటలకు సార్వత్రిక, సమగ్ర, సమర్థవంతమైన పంటల బీమా, పరిహారం ప్యాకేజీని అమలు చేయడానికి పిఎంఎఫ్‌బివైని పునరుద్ధరించాలని కోరారు.

డిమాండ్లు

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా సి2ప్లస్ 50 శాతం ఫార్ములాను ఉపయోగించి అన్ని పంటలకు ఎంఎస్‌పి హామీ ఇచ్చే చట్టం రూపొందించి అమలు చేయాలి. హామీ ఇచ్చిన పంట సేకరణ వెంటనే చేయాలి.
- కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ రద్దు చేయాలి. కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా ఎస్‌కెఎం ప్రతినిధులను చేర్చడంతోపాటు రైతులకు తగిన ప్రాతినిధ్యంతో ఎంఎస్‌పిపై మాత్రమే కొత్త కమిటీని తిరిగి ఏర్పాటు చేయాలి.
- రైతులందరి రుణాలన్నింటినీ తక్షణమే మాఫీ చేయాలి. ఎరువులతో సహా ఇన్‌పుట్ ధరలను తగ్గించాలి.
- జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి సూచించిన విద్యుత్ సవరణ బిల్లు-2022ను ఉపసంహరించుకోవాలి.
- లఖింపూర్ ఖేరీ జిల్లా టికోనియాలో నలుగురు రైతులు, జర్నలిస్టు హత్యకేసులో ప్రధాన సూత్రధారి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాని మంత్రివర్గం నుంచి తొలగించి, అరెస్టు చేసి జైలుకు పంపాలి.
- రైతు ఉద్యమంలో అమరులైన రైతుల కుటుంబాలతోపాటు లఖింపూర్ ఖేరీలో అమరులైన, గాయపడిన రైతుల కుటుంబాలకు పరిహారం, పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి.
- పంట బీమా, పరిహారం ప్యాకేజీని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిన పిఎంఎఫ్‌బివైని పునరుద్ధరించాలి. నష్టాన్ని వ్యక్తిగత ప్లాట్ల ఆధారంగా అంచనా వేయాలి.
- రైతులు, వ్యవసాయ కూలీలందరికీ నెలకు రూ.5,000 రైతు పెన్షన్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి.
- రైతు ఉద్యమం సందర్భంగా బిజెపి పాలిత రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో రైతులపై నమోదు చేసిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.
- సింఘూ సరిహద్దు వద్ద అమరులైన రైతుల స్మారక చిహ్నం నిర్మాణానికి భూమి కేటాయించాలి.

న్యాయవ్యవస్థను బెదిరించడం ప్రజాస్వామ్యమా?

- కిరణ్ రిజిజు వ్యాఖ్యలపై సంజయ్ రౌత్ ఆగ్రహం

ముంబయి : రిటైర్డ్ న్యాయమూర్తులకు సంబంధించి కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) నేత సంజయ్ రౌత్ ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది రిటైర్డ్ న్యాయమూర్తులు, భారత వ్యతిరేక ముఠాలో భాగమైన కొంతమంది భారత న్యాయవ్యవస్థను ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించేలా చేస్తున్నారని శనివారం ఢిల్లీలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నమని అన్నారు. న్యాయవ్యవస్థను న్యాయశాఖ మంత్రి బెదిరించడం ఎలాంటి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి తలవంచడానికి నిరాకరించే న్యాయమూర్తులకు ఇది ముప్పు అని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని లోక్‌సభ నుంచి సస్పెండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రాహుల్‌గాంధీ ఎందుకు క్షమాపణలు చెప్పాలని ప్రశ్నించారు. బిజెపి నేతలు విదేశీ గడ్డపై దేశానికి, రాజకీయ నేతలకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు.


పార్లమెంటరీ కమిటీ, రాహుల్ గాంధీ

ఎవరి జోక్యం కోరలేదు..

- పార్లమెంటరీ కమిటీకి రాహుల్ వివరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ స్పష్టత ఇచ్చారు. దేశ ప్రజాస్వామ్యంపైనే తాను ప్రశ్నలు లేవనెత్తానని, దేశాన్ని అవమానించ లేదని, దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశాల జోక్యాన్ని కోరలేదని రాహుల్ వివరణ ఇచ్చారు. జి-20కి భారతదేశం అధ్యక్షత వహిస్తుండటంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధ్యక్షతన శనివారం జరిగిన పార్లమెంటరీ సంప్రదింపుల (కన్సల్టేటివ్) కమిటీ ముందు రాహుల్ ఈ వివరణ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బిజెపి ఎంపి ఒకరు రాహుల్ పేరు ప్రస్తావించకుండా ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించడంతో సమావేశంలో అధికార, ప్రతిపక్ష ఎంపిల మధ్య వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. 1975లో విధించిన అత్యవసర పరిస్థితి కంటే ప్రజాస్వామ్యానికి అతిపెద్ద మచ్చ మరొకటి ఉండదని బిజెపి ఎంపి వ్యాఖ్యానించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా హాజరైన ఈ సమావేశంలో భారత్ జి20 అధ్యక్ష పదవిపై చర్చ జరిగింది. జి-20 అధ్యక్ష పదవిపై జైశంకర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఆ తరువాత రాహుల్ గాంధీ మాట్లాడుతూ, తన ప్రత్యర్థులు ఇటు పార్లమెంటులోను, పార్లమెంటు వెలుపల ప్రచారం సాగిస్తున్నట్టుగా తాను ఎలాంటి దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఇది అంతర్గత విషయమని, ఇక్కడే పరిష్కరించుకుంటామని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక ఒక వ్యక్తికి వ్యతిరేకంగా చెప్పినదే కానీ, ఇండియాపై దాడి కాదని అన్నారు. రాహుల్ తన వివరణ కొనసాగిస్తుండగా, బిజెపి ఎంపిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎంపిలే ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు, స్పష్టత ఇచ్చే హక్కు ప్యానెల్ సభ్యుడికి ఉంటుందంటూ ప్రతిపక్ష ఎంపిలు రాహుల్‌కు మద్దతు పలికినట్లు సమాచారం. ఈ అంశాన్ని పార్లమెంటులో మాట్లాడాలని జైశంకర్ రాహుల్‌కు సూచించారు. కొందరు ఇక్కడే ప్రశ్న లేవనెత్తినప్పుడు దానిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు.

రాహుల్ నివాసానికి ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ : "మహిళలు ఇప్పటికీ లైంగిక వేధింపులకు గురవుతున్నారు" అన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీస్ ఉన్నతాధికారులు ఆదివారం ఆయన నివాసానికి చేరుకున్నారు. ఢిల్లీ స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) సాగర్ ప్రీత్ హుడా నేతృత్వంలోని బృందం తుగ్లక్‌లేన్‌లో ఉన్న రాహుల్ ఇంటికి వెళ్లారు. శ్రీనగర్‌లో భారత్ జోడోయాత్ర నిర్వహిస్తున్న సమయంలో ఇప్పటికీ స్త్రీలపై వేధింపులు జరుగుతున్నాయని రాహుల్‌గాంధీ పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై సాగర్ ప్రీత్ హుడా మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర సుదీర్ఘ యాత్ర అని, బాధితుల వివరాలు ఇవ్వడానికి సమయం కావాలని రాహుల్‌గాంధీ కోరినట్లు చెప్పారు. వేధింపుల భారినపడిన ఢిల్లీ మహిళలు ఎవరైనా ఉన్నారా అనేది తమకు ముఖ్యమని, మైనర్ బాధితులు కూడా ఉండవచ్చని అన్నారు. ఈ నెల 15న రాహుల్‌గాంధీని కలవడానికి వచ్చామని, ఆయన లేకపోవడంతో లైంగిక వేధింపులకు సంబంధించి సంప్రదించిన మహిళల వివరాలను అందించాలని ఈ నెల 16న నోటీసులు ఇచ్చామని తెలిపారు.

కాంగ్రెస్ ఆగ్రహం

బాధితుల పేర్లను వెల్లడించాలని ఢిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని ఒత్తిడి చేయలేరంటూ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

మోటార్లకు మీటర్లు... రైతులకు ఉరితాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

మొగ్గు చూపించారని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టేందుకు దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ముందుకు రాకున్నా ఎపి ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. అచ్చెన్నాయుడు పూర్తిగా మాట్లాడక ముందే మంత్రులు సీదిరి అప్పలరాజు, అంబటి రాంబాబు అడ్డుతగిలారు. విద్యుత్ అంశంపై మాట్లాడే అర్హత తెలుగుదేశానికి లేదని అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయనికి ఉచిత విద్యుత్‌ను ఇస్తానంటే ఉచిత విద్యుత్ సాధ్యం కాదని, తీగలపై బట్టలు ఆరేసుకునే పరిస్థితి వస్తుందని చంద్రబాబునాయుడు ఎద్దేవా చేశారని అన్నారు. రైతులు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని అడిగితే కాల్చిచంపారని వీరికి వ్యవసాయ విద్యుత్‌పై మాట్లాడే అర్హత లేదని అన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఈ ప్రాజెక్టును తీసుకొచ్చామని తెలిపారు. మీటర్లు వుంటే రైతులకు ప్రభుత్వం ఎంత ఇస్తుందో తెలుస్తుందని, ఈ ప్రక్రియతో రైతులకు బాధ్యత వస్తుందని అన్నారు. శ్రీకాకుళంలో 18 వేల మీటర్లు వున్నాయని, ఆ జిల్లాలో తక్కువ వున్నాయనే పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడగానే స్పీకర్ తమ్మినేని సీతారాం సభను వాయిదా వేశారు.

పరారీలో అమృత్‌పాల్

పంజాబ్‌లో హైఅలర్ట్

చండీగఢ్ : ఖలిస్తానీ వేర్పాటు వాద సానుభూతిపరుడు, 'వారిస్ పంజాబ్ దే' నేత అమృత్‌పాల్ సింగ్ ఇప్పటికీ పరారీలో ఉన్నట్లు ఆదివారం పంజాబ్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. గాలింపు చర్యలు చేపడుతున్నామని, శాంతిభద్రతలకు సహకరించాలని ప్రజలను కోరు. శనివారం సాయంత్రం జలంధర్‌లో అమృత్‌పాల్ సింగ్ చిక్కినట్టే చిక్కి మోటార్ సైకిల్‌పై పారిపోయినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఆయన వినియోగించిన ఎస్‌యువి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నాడో కచ్చితమైన సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు. అనుమానం ఉన్న అన్ని ప్రదేశాల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. పంజాబ్‌లో హై అలర్ట్ ప్రకటించారు. ఇంటర్నెట్‌పై నిషేధం కూడా విధించారు. 'వారిస్ పంజాబ్ దే' కి చెందిన 78 మంది సభ్యులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఆరు నుంచి ఏడుగురు అమృత్‌పాల్ సింగ్ గన్‌మేన్లు ఉన్నట్లు జలంధర్ పోలీస్ కమిషనర్ కుల్దీప్‌సింగ్ చాహల్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవహారాలు నిర్వహిస్తున్న అమృత్‌పాల్ సింగ్ సన్నిహితుడు దల్జీత్ సింగ్ కల్సిని కూడా హర్యానాలోని గుర్‌గావ్‌లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రజలు సంయమనం పాటించాలని.. ఎలాంటి తప్పుడు సమాచారాన్ని షేర్ చేయొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

మారియోపోల్‌లో పుతిన్ ఆకస్మిక పర్యటన

కీవ్ : రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌లోని మారియోపోల్‌లో ఆకస్మికంగా పర్యటించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యలు ప్రారంభమైన అనంతరం విలీన భూభాగాల్లో పుతిన్ పర్యటించడం ఇదే మొదటసారి. పుతిన్ శనివారం ప్రత్యేక హెలికాప్టర్ లో మారియోపోల్ కు వెళ్లారని, కారులో నగరం అంతటా పర్యటించారని స్థానిక మీడియా తెలిపింది. ఉక్రెయిన్‌లో రష్యన్లు అధికంగా గల క్రిమియా రిఫరెండమ్ ద్వారా రష్యాలో విలీనమై తొమ్మిదేళ్లయిన సందర్భంగా ఆ భూ భాగాన్ని సందర్శించిన అనంతరం పుతిన్ మారియోపోల్‌కు వెళ్లారు. స్థానిక మాస్కో-నియమించిన గవర్నర్ మిఖాయిల్ రజ్వోజాయేవ్‌తో కలిసి నల్ల సముద్రపు ఓడరేవు నగరం సెవాస్టోపోల్‌ను సందర్శించి నట్లు రష్యా మీడియా పేర్కొంది.

బెంగాల్ టీచర్ల రిక్రూట్‌మెంట్ స్కామ్‌పై

సిబిఐ కొత్త ఎఫ్‌ఐఆర్

న్యూఢిల్లీ : బెంగాల్‌లో ఉపాధ్యాయుల నియామక కుంభకోణం కేసులో కొత్తగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు సిబిఐ అధికారులు ఆదివారం ప్రకటించారు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల నియామకంలో అక్రమాలకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులపై ఈ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్ బోర్డు ఆఫ్ ప్రైమరీ ఎడ్యుకేషన్ (డబ్ల్యుబిబిపిఇ) ద్వారా 16,500 ప్రైమరీ ఉపాధ్యాయుల నియామకాల కోసం 2020 నవంబర్ 23న నిర్వహించిన పరీక్షల్లో అక్రమాలు, అవినీతి చోటుచేసుకుందని ఆరోపణలు రావడంతో ఈ కేసు నమోదైంది. 2021 ఫిబ్రవరి 15న తొలి మెరిట్ జాబితాను డబ్ల్యుబిబిపిఇ ప్రకటించింది. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు, హైకోర్టు పర్యవేక్షణలో సిబిఐ ఈ కేసు విచారిస్తుంది. ఈ ఏడాది జనవరిలో సిబిఐకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో ఒక అధికారిని హైకోర్టు తొలగించింది.

వలసదారుల బిల్లుకు వ్యతిరేకంగా

ఇంగ్లండ్‌లో నిరసనలు

లండన్ : ఇంగ్లండ్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వలసదారుల చట్టానికి వ్యతిరేకంగా ఇంగ్లండ్‌లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. లండన్‌తో సహా స్కాట్లాండ్, వేల్స్ రాజధాని కార్డిఫ్‌లో వేలాదిమంది ఆందోళన చేశారు. లండన్‌లో శనివారం జరిగిన నిరసన ప్రదర్శనకు రెండు వేలమందికిపైగా హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొత్త వలసదారుల చట్టం అమానవీయమని, చట్టవిరుద్ధమని నిరసనకారులు విమర్శించారు. జాత్యహంకారంతో కూడిన ఈ ప్రభుత్వం ప్రజల్ని విభజించడానికే ఈ బిల్లును తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్‌కు అక్రమ వలసలను నిరోధించే పేరుతో కొత్త చటాన్ని గత వారంలో ఇంగ్లండ్ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం అనుమతి లేకుండా ఇంగ్లండ్‌కు వలస వచ్చే వారిని రువాండా వంటి మూడో ప్రపంచ దేశాలకు పంపిస్తారు. ఈ బిల్లును ఇప్పటికే యునెస్కో, మానవ హక్కుల కమిషన్ వ్యతిరేకించాయి.

లండన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నిరసనకారులు

పార్టీ, ప్రభుత్వ సంస్థల పటిష్టతకు ప్రణాళిక

- చైనా కమ్యూనిస్టు పార్టీ సర్క్యులర్ జారీ

బీజింగ్: చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సిపిసి) కేంద్ర కమిటీ , స్టేట్ కౌన్సిల్ పార్టీ, ప్రభుత్వ సంస్థలను మరింత పటిష్టపరచే దిశగా ఓ ప్రణాళికను రూపొందించింది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను సిపిసి ఇటీవల జారీ చేసింది. 18వ సిపిసి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ మొదలుకుని, పార్టీ, ప్రభుత్వ సంస్థలన్నిటిని మరింత పటిష్టపరిచే యత్నాలు జరుగుతున్నాయి, చైనా సంపూర్ణ పరివర్తనకు పార్టీ, ప్రభుత్వ ప్రతినిధులు నిర్వర్తించాల్సిన విధులను నిర్దిష్టంగా ప్రణాళిక పేర్కొంది. నూతన కర్తవ్యాలు సాఫీగా అమలు జరిగేలా చూసేందుకు సంస్థాగత నిర్మాణం, పార్టీ , ప్రభుత్వ సంస్థల విధుల్లో సంస్కరణలు, సర్దుబాట్లు అవసరమని సిపిసి పేర్కొంది.కీలకమైన రంగాలలో సంస్థాగత సంస్కరణలను మరింత లోతుగా చేయడానికి, సోషలిస్ట్ ఆధునీకరణపై పార్టీ నాయకత్వం మరింతగా కేంద్రీకరించి పనిచేసేందుకు ఈ ప్రణాళిక దోహదపడుతుందని పేర్కొంది. సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం సెంట్రల్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆ ప్రణాళిక సూచించింది. సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని కూడా పేర్కొంది. ఈ డిపార్టుమెంట్ ప్రజా ఫిర్యాదుల నిర్వహణ, ప్రజల అభిప్రాయాలను సేకరించడంలో సమన్వయకర్తగా వ్యవహరిస్తుంది. అవసరమైనప్పుడు తగు మార్గనిర్దేశం కూడా చేస్తుంది. అలాగే ప్రభుత్వేతర సంస్థలలో పార్టీ నిర్మాణం, కొత్త రకాల ఆర్థిక,సామాజిక సంస్థలు, కొత్త రకాల ఉపాధిలో సమూహాల మధ్య సమన్వయంపైన కేంద్రీకరిస్తుంది. అలాగే జాతీయ ప్రజా ఫిర్యాదులు, ప్రతిపాదనల నిర్వహణను పర్యవేక్షిస్తుంది .ప్రాంతీయ, మునిసిపల్, కౌంటీ స్థాయిలలో పార్టీ కమిటీలు తదనుగుణంగా తమ సామాజిక కార్య విభాగాలను ఏర్పాటు చేస్తాయి. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) డిప్యూటీల పనిని పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రణాళిక పేర్కొంది. చైనా పీపుల్స్ బ్యాంక్ స్థానిక శాఖలు మరింత సమర్థవంతంగా పనిచే సేందుకు నిర్దిష్టంగా కొన్ని సూచనలు చేసింది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఫైనాన్షియల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రణాళిక సూచించింది. జాతీయ డేటా బ్యూరోఏర్పాటు, . వద్ధుల సంరక్షణ యంత్రాంగా న్ని, మేధో సంపత్తి హక్కుల నిర్వహణ యం త్రాంగాన్ని మెరుగు పరచేందుకు పలు సూచనలు చేసింది. పార్టీ, ప్రభుత్వ సంస్థల సిబ్బంది, వనరు లను అత్యంత సమర్థవంతంగా ఉపయోగించేలా చూసేందుకు కొన్ని చర్యలను ప్రతిపాదించింది. సెంట్రల్ పార్టీ, ప్రభుత్వ సంస్థలు తమ సిబ్బందిని 5 శాతం తగ్గించుకుంటాయని ప్రణాళిక పేర్కొంది. స్థానిక పార్టీ, ప్రభుత్వ సంస్థలలో సిబ్బంది ఆప్టిమైజ్‌కు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించే విచక్షణాధికారాన్ని ప్రాంతీయ స్థాయి పార్టీ కమిటీలకు వదిలివేసింది. ఇటువంటి అనేక మార్పులను ప్రణాళిక పేర్కొంది. సంద్ర అధికారులు 2023 చివరి నాటికి ఈ సంస్కరణల ప్రక్రియను పూర్తి చేస్తారు, స్థానిక ప్రభుత్వాలు మాత్రం ప్రణాళికలో నిర్దేశించిన గడువు ప్రకారమే 2024 చివరి నాటికి దీనిని పూర్తి చేస్తాయి.

ఈక్వెడార్‌లో భూకంపం

ఈక్వెడార్ : దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్, ఉత్తర పెరూ తీర ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.8గా నమోదయింది. ఈ భూ కంపం ధాటికి ఇళ్లు కూలి 14 మంది మరణించారు. చాలా ఇళ్లు,హాస్పిటల్స్, స్కూల్స్, ఇతర భవంతులు ధ్వంసమ య్యాయని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. నగరాల్లో శిథిలాల దిబ్బలు కనిపించాయి. భూమి కంపించగానే భయాందోళనకు గురైన ప్రజలు వీధుల్లోకి పరుగులు తీశారు. రెస్క్యూ అధికారులు సహాయం అం దించడానికి అక్కడికి చేరుకున్నారు.అమెరికన్ జియోల ాజికల్ సర్వే ప్రకారం 6.8 తీవ్రతతో భూకంపం సంభ వించింది. భూమికి 66 కిలోమీటర్ల లోతులో ఈ భూకం పం వచ్చిందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది.

పారిస్‌లో నిరసనలపై ఉక్కుపాదం ..

పారిస్ : పెన్షన్ బిల్లుని వ్యతిరేకిస్తూ ప్రదర్శన చేస్తున్న నిరసనకారులపై మాక్రాన్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. టియర్‌గ్యాస్‌తో పాటు డస్ట్‌బిన్‌లకు నిప్పటించి నిరసనకారులపెకి విసిరారు. దీంతో ఆప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందలాది మందిని అరెస్టు చేశారు. పార్లమెంట్ అనుమతి లేకుండా మాక్రాన్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఈ బిల్లును వ్యతిరేకిస్తూ శనివారం దక్షిణ పారిస్‌లోని ప్లేస్ డిఇటాలిలో వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. రిఫైనరీల్లోని కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెకు దిగారు. దీంతో పారిస్ వీధులు చెత్తమయమయ్యాయి.

మీకోసం

రెండు లేదా మూడు వెల్లుల్లి రెమ్మలు చిదిమి ఒక స్పూన్ తేనెతో కలిపి తీసుకుంటే నులి పురుగుల సమస్య తగ్గుతుంది.

జీవన సౌరభం

జీవితంలో ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

ప్రియమైన ఓ పిచ్చుక....

నీ చక్కని రూపం
మా ఇంటావరణలో కనపడితే
నా గుండె కువకువలాడుతుంది

నీవు కిచకిచల
పల్లవి పల్లకిలో ఊరేగితే
నా హృదయపు కుసుమాలు విచ్చుకుంటాయి

నీవు స్వేచ్ఛగా
మా ఇంటి చూరుల్లో వెచ్చగా
నలువైపులా అమాయకంగా చూస్తుంటే...
నా నేత్రాలు హరిత పత్రాలవుతాయి

నీవు ఆ మూల నుండి ఈ మూలకు
ఈ మూల నుండి ఆ మూలకు
చక్కర్లు గొడుతుంటే
నాలో ఏ మూలో దాగిన
ఆనందసాగరాలెగసిపడతాయి

నేనేవూరెళ్ళనా
నీవెదురైతే
నా విహార యాత్రలు
హాయిగా సాగుతాయి

నీ వయ్యారి నడకలకు
విరిదండాలు వెయ్యాలని
నా ప్రతిన.!

నీ సింగారి ముంగురులకు
బంగారు రంగులద్దాలని
నా తపన..!
మా ఇంటి చూరులో
వేలాడుతూ ఊయలూగే నిన్ను
అలా అలా అలలా అలివేణివై ఎగిరే నీకు,
సెల్ ఫోన్ టవర్ల వలలు విసిరి
భక్షిస్తున్నదెవరు నేస్తమా..!?

వ్యవసాయ రంగానికి చేదోడైన
స్నేహానికి చిరకాల చిహ్నమైన
నిన్నెలా రక్షించుకోగలం నేస్తమా...
మా గుండెలు జొన్న కంకులుగా మారితే తప్ప...!

- 'స్ఫూర్తి'శ్రీనివాస్,
విజయవాడ. 99858 57599

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రూపాయికే దుస్తులు

కరోనా తర్వాత పేదరికం బాగా పెరిగింది. ప్రజలు కనీస అవసరాలు తీర్చుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త బట్టలు కొనుగోలు చేసే స్థితిలో చాలా కుటుంబాలు లేవు. ఈ క్రమంలో నలుగురు స్నేహితులు కలిసి 'ఇమాజిన్ ట్రస్టు' ద్వారా దుస్తులు అందజేస్తున్నారు. అందుకు ఒక రూపాయి మాత్రమే తీసుకుంటున్నారు.

చెన్నైకు చెందిన మెలిషా, వినోద్, నితిన్, విఘ్నేష్‌లు కాలేజీ స్నేహితులు. వీరికి సామాజిక కుటుంబాలకు చెందిన ప్రజలకు ఏదో ఒక రూపంలో సాయం చేయడం మొదటి నుంచీ అలవాటు. సింగర్, రచయిత జాన్ లెన్నాన్ అంటే వీరికి ఎంతో అభిమానం. ఆయన రాసిన 'ఇమాజిన్' పాట వీరి జీవిత లక్ష్యాలను మార్చింది. ప్రపంచంలో అంతరాలను పోల్చి చెబుతూ, జీవిత సత్యాలను తెలియజేసిన ఈ పాట వీరిని ఆలోజింపచేసింది. అప్పటి నుంచీ 'ఇమాజిన్ ట్రస్టు' పేరుతో వెనుకబడిన కుటుంబాలను ఆదుకుంటూ ఉన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం, పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

చదువు పూర్తి అయిన తర్వాత వీరు అంతా కలిసి మంగళూరులో బట్టల షాపు పెట్టారు. ఆ తర్వాత బెంగుళూరులో స్థిరపడటంతో షాపునూ ఇక్కడకు మార్చారు. ట్రస్టు ద్వారా ప్రజలను చైతన్యపరిచే కార్యాక్రమాలు చేశారు. కరోనా సమయంలో పేదల ఇళ్లకు వెళ్లి భోజన ప్యాకెట్లు కొన్ని నెలల పాటు అందజేశారు. ఈ క్రమంలో కొంతమంది తమ సమస్యలను వీరితో పంచుకున్నారు. కట్టుకునేందుకు సరైన బట్టలు లేవని, పిల్లలకు పాత బట్టలుంటే ఇవ్వమని కోరారు. దాంతో వీరు బాగా ఆలోచించారు. 'ఇమాజిన్ క్లోత్స్ బ్యాంక్' స్థాపించారు. దాతలు అందించిన బట్టలను శుభ్రం చేసి, గంజి పెట్టి ఐరన్ చేసి పేద, మధ్య తరగతి కుటుంబాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లి పంపిణీ చేశారు. కొంతమంది మాత్రమే ముందుకు వచ్చి తీసుకున్నారు. మధ్యతరగతి చెందిన కొంతమంది తీసుకునేందుకు వెనకాడారు. 'ఎవరో వాడినవి. మాకొద్దు' అంటూ తిరస్కరించారు. రకరకాలగా అభ్యంతరాలు వ్యక్తపరిచారు.

గౌరవంగా

మంచి పని చేసే ప్రయత్నంలో ఎదురుదెబ్బలు సహజమని మెలిషా, ట్రస్టు సభ్యులు అభిప్రాయపడ్డారు. దాతలు ఇచ్చిన డబ్బుతో తక్కువ ధరకు బట్టలను కొనుగోలు చేస్తున్నారు. వాటిని వయస్సుల వారీగా విభజించి ఓ షాపులో ఉంచుతున్నారు. మరికొంత మంది దాతలు అసలు వాడని బట్టలను తీసుకొచ్చి సభ్యులకు ఇస్తున్నారు. వీటిని రీసైక్లింగ్ చేసి క్లాత్ బ్యాంకులో ఉంచారు. ఉచితంగా ఇస్తే తీసుకునేందుకు సంకోచిస్తున్న క్రమంలో ఒక్కో డ్రస్‌కు ఒక రూపాయి చెల్లించి తీసుకెళ్లమని సభ్యులు కోరారు. అప్పటి నుంచి పేద మహిళలు, యువత ఈ షాపుకు తరలి వస్తున్నారు.



పండగలు, శుభకార్యాలు ఉన్న సమయంలో పేద కుటుంబాల వారు వచ్చి తమకు నచ్చిన బట్టలను తీసుకెళు తున్నారు. రూపాయి చెల్లించడం వారికి పెద్ద కష్టంగా ఉండదు. ఎంతో గౌరవంగానూ ఉందని షాపుకు వస్తున్నవారు అంటున్నారు. ప్రతి ఆదివారం ఓ వీధిలో ఈ షాపు పెట్టి బట్టలను అందుబాటులో ఉంచుతున్నారు. సభ్యులు చేస్తున్న ఈ మంచి పనిని దృష్టిలో పెట్టుకుని జనం తమకు అవసరమైనంత మేరకే వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ పదివేల మందికి పైగా బృందం బట్టలను పంపిణీ చేసింది. పేద కుటుంబాల క్షేమం కోసం కృషి చేస్తున్న ట్రస్ట్ సభ్యుల దాతృత్వ హృదయాన్ని అక్కడ వారంతా అభినందిస్తున్నారు.

కొత్తిమీర మజ్జిగలో పోషకాలు

వేసవికాలం వచ్చిందంటే దాహం తీర్చే చక్కని మజ్జిగను తాగుతుంటారు. ఈ మజ్జిగలో రోజుకోకటి చొప్పున కరివేపాకు, అల్లం, పచ్చి మిరపకాయ, కొత్తిమీర, పుదీన ఏదోకటి కలుపుకుని తాగితే రుచితో పాటు పోషకాలు అందుతాయి. ఎండలో తిరుగుతున్నవారికి ఇవి ఔషదంలా పనిచేస్తాయి. ప్రయాణించే వారు, పనులకు వెళ్లే వారు మంచినీళ్ల బదులుగా కొత్తిమీర మజ్జిగను ఎక్కువగా తీసుకుంటే అనారోగ్యానికి గురికారు.

- కొత్తిమీర మజ్జిగను తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. టైప్ 2 డయాబెటిస్ నుంచి బయట పడవచ్చు. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది.
- కొత్తిమీరలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. జీర్ణశక్తిని పెంచుతాయి. మెటబాలిజం పెరుగుతుంది. మలబద్ధకం, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. ఆకలి నియంత్రణలో ఉంటుంది. కొత్తిమీర జ్యూస్ తాగడం ఇష్టం లేనివారు మజ్జిగలో కలుపుకుని తాగొచ్చు. దీనివల్ల శరీరంలో ఉండే కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.
- కొత్తిమీర మజ్జిగలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అవన్నీ గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీని వల్ల గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. హైబీపీ తగ్గుతుంది.
- ఒత్తిడి, ఆందోళనలతో సతమతం అయ్యే వారు ప్రతిరోజూ ఒక లీటర్ కొత్తిమీర మజ్జిగను తాగితే ఫలితం ఉంటుంది.
- కొత్తిమీరలో ఐరన్, విటమిన్ ఇ లు ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగు పరుస్తాయి. చర్మం, వెంట్రుకలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- పెరుగన్నం బదులుగా కొత్తిమీర మజ్జిగ అన్నం తింటే ఈ కాలంలో వచ్చే జీర్ణ సమస్యలు పోతాయి. లేదా కొంచెం ఉప్పు వేసి తాగడం వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. చర్మం కాంతివంతంగా మారుతుంది.

మళ్లీ నటిస్తున్నారు..

తెలుగు ఇండస్ట్రీలో ఇప్పుడో ట్రెండ్ నడుస్తోంది. చాలా కాలంగా ఇది కొనసాగుతున్నా.. ఇప్పుడు మళ్లీ కనిపిస్తోంది. పాత హీరోయిన్లు కొత్త పాత్రల్లో కనిపిస్తున్నారు. గతంలో అయితే ఇండస్ట్రీలో పది నుండి 20 ఏళ్ల పాటు కొనసాగిన నటీమణులు ఉన్నారు. కాని ఇప్పుడలా లేదు. హీరోయిన్స్ కాలపరిమితి సంవత్సరాల నుండి సినిమాలకి పడిపోయింది. ఒకటి రెండు సినిమాల్లో కనిపించడం ఆ తరువాత తెరమరుగవ్వడం చూస్తున్నాం. పెళ్లి తరువాతో.. లేక అవకాశాలు రాకో ఇండస్ట్రీకి దూరమైన హీరోయిన్లంతా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టడం సాధారణ విషయమే.. తాజాగా కొంతమంది వరుస అవకాశాలతో నటిస్తుంటే మరికొంతమంది అడపాదడపా కనిపిస్తున్నారు.

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ పక్కన హీరోయిన్లుగా చేసిన విజయశాంతి, రాధిక, రాధ, సుహాసిని, సుమలత, అమల తదితర హీరోయిన్లలో రాధిక, సుహాసిని తల్లి, అత్త పాత్రలతో ఎప్పుడో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. అయితే చాలా విరామం తీసుకున్న విజయశాంతి 'సరిలేరు నీకెవ్వరు' సినిమాతో మహేష్‌బాబు తల్లి పాత్రలో నటించి మెప్పించారు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రంలో చిన్న పాత్రలో కనిపించిన అమల 'ఒకే ఒక జీవితం' సినిమాలో పూర్తి నిడివి ఉన్న పాత్రలో నటించి మెప్పించారు. రాధ కూడా సెకండ్ ఇన్నింగ్స్ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

అలాగే ఆ తరువాత జాబితాలో ఉన్న రమ్యకృష్ణ, రంభ, రాశి, మీనా, ఆమని, ఇంద్రజ ఇదివరకే రెండోసారి ఇన్నింగ్స్ ప్రారంభించేశారు.

అందరికంటే ముందు రమ్యకృష్ణని చెప్పుకోవాలి. ఆ తరువాత రాశి, మీనా వరుసగా తల్లి, అత్త, అమ్మ, అక్క, వదిన పాత్రల్లో మెప్పించారు. కొంచెం ఆలస్యంగా ఆమని, ఇంద్రజ కూడా యువ హీరో, హీరోయిన్లకు తల్లి, అత్త పాత్రల్లో నటించి మెప్పిస్తున్నారు.

ఒకప్పటి హీరోయిన్ జీవిత కూడా రజనీకాంత్ తాజా సినిమా 'లాల్ సలాం' చిత్రంలో 30 ఏళ్ల తరువాత చెల్లెలి పాత్రలో కనిపించబోతూ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు.

ప్రియమణి, స్నేహ, భూమిక, సిమ్రాన్ తరువాత ఈ మధ్య కాలంలో ఇంద్రజ, ఆమని ఎక్కువ అవకాశాలతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ జాబితాలో లైలా, మీరాజాస్మిన్, రేణుదేశాయ్ కూడా చేరారు. సదా కూడా వెండితెరపై మరోసారి మెరవాలనుకుంటున్నారు. భూమిక, లైలా, సిమ్రాన్, స్నేహ, ఇలియానా, సదా, ప్రియమణి, మీరా జాస్మిన్ కూడా వరుస అవకాశాల కోసం సిద్ధమవుతున్నారు. అప్పట్లో హీరోయిన్లుగా ఉన్న పోటీ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ పాత్రల్లో కూడా కనిపిస్తోంది.

కేవలం రెండు చిత్రాల్లోనే (బద్రి, జానీ) నటించి ఇండస్ట్రీకి దూరమైన రేణుదేశాయ్, రవితేజ నటిస్తున్న 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంలో హేమలతా లవణం వంటి శక్తివంత పాత్రలో కనిపించబోతున్నారు. మీరాజాస్మిన్ కూడా రామ్, బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఇంకా పేరు పెట్టని చిత్రంలో ఓ పాత్రతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. జూనియర్ ఎన్‌టిఆర్ చిత్రం 'రూలర్', నాని నటించిన 'మిడిల్ క్లాస్ అబ్బాయి' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన భూమిక ఆ తరువాత 'యు టర్న్', 'సవ్యసాచి' చిత్రాల్లో ముఖ్య పాత్రల్లో కనిపించారు. 2008 లోనే సూర్య సినిమా 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్' చిత్రంలో ఒక పాత్రలో సూర్యకు తల్లిగా సిమ్రాన్ కనిపించారు.

అవకాశాలు పుష్కలంగా వస్తున్న సమయంలోనే పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోయిన లయ మంచి పాత్రలు వస్తే మళ్లీ నటిస్తానని చెబుతున్నారు. చాలా విరామం తర్వాత 'విక్రమ్' సినిమాలో లైలా కనిపించారు. తాజాగా 'శబ్దం' చిత్రంలో ఆమె కీలక పాత్రలో నటించనున్నారు.

ఏ దర్శక, నిర్మాతల ప్రాజెక్టుల్లో హీరోయిన్లుగా కనిపించారో వారితోనే.. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడం, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటించడానికి సిద్ధమైన ఈ నటీమణులు ముమ్ముందు మరిన్ని అవకాశాలతో కనిపించాలని ఆశిద్దాం..

కుప్పకూలి..!

విశాఖలో భారత్ దారుణ ఓటమి
బ్యాట్‌తో, బంతితో ఘోర వైఫల్యం
స్టార్క్‌కు ఐదు వికెట్లు, మార్ష్ మెరుపులు

తీరంలో టీమ్ ఇండియా చేతులెత్తేసింది. ఎడమ చేతి వాటం పేసర్ మిచెల్ స్టార్క్ (5/53) దెబ్బకు 117 పరుగులకే కుప్పకూలారు. బ్యాటింగ్ పిచ్‌పై ఆసీస్ పేసర్ విజృంభణతో ఆతిథ్య జట్టు 26 ఓవర్లలోనే ఆలౌట్ కాగా.. స్వల్ప లక్ష్యాన్ని కంగారూలు ఊదేశారు. ఓపెనర్లే 11 ఓవర్లలో బాదేసి సిరీస్‌ను 1-1తో సమం చేశారు. వన్డే సిరీస్ నిర్ణయాత్మక పోరు బుధవారం చెన్నైలో జరుగనుంది.

విశాఖపట్నం : మిచెల్ స్టార్క్ (5/53) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. బ్యాటింగ్ పిచ్‌పై భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. సీన్ అబాట్ (3/23), నాథన్ ఎలిస్ (2/13) సైతం మెరవటంతో తొలుత భారత్ 117 పరుగులకే కుప్పకూలింది. అక్షర్ పటేల్ (29 నాటౌట్, 29 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), విరాట్ కోహ్లి (31, 35 బంతుల్లో 4 ఫోర్లు) భారత్‌కు గౌరవప్రద స్కోరు అందించారు. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (66 నాటౌట్, 36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సులు), ట్రావిశ్ హెడ్ (51 నాటౌట్, 30 బంతుల్లో 10 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలతో మెరవటంతో 11 ఓవర్లలోనే ఆస్ట్రేలియా లాంఛనం ముగించింది. మరో 234 బంతులు మిగిలి ఉండగానే 10 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. 37 ఓవర్లలో ముగిసిన వన్డే మ్యాచ్‌లో గెలుపొందిన ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఐదు వికెట్లతో విశాఖ వన్డేను ఏకపక్షం చేసిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

బ్యాటర్లు బోల్తా.. : టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా ఛేదనకు మొగ్గు చూపించింది. దీంతో భారత్ తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. విశాఖలో తిరుగులేని రికార్డున్న భారత్ ఫేవరేట్‌గా బరిలో నిలిచినా.. లెఫ్ట్ ఆర్మ్ సీమర్ మిచెల్ స్టార్క్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఎడమ చేతి వాటం పేసర్లను ఎదుర్కోవటంలో ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్న టీమ్ ఇండియా విశాఖలో మరోసారి ఆ బలహీనత బయటపెట్టుకుంది. ఇన్నింగ్స్ మూడో బంతికే యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (0)ను అవుట్ చేసిన స్టార్క్.. ఐదో ఓవర్లో కెప్టెన్ రోహిత్ శర్మ (13) కథ ముగించాడు. సూర్య కుమార్ యాదవ్ (0), కెఎల్ రాహుల్ (9)లను సైతం పది ఓవర్లలోపే అవుట్ చేసిన స్టార్క్ భారత్‌ను 5/49తో పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. విరాట్ కోహ్లి (31) సావధానంగా బ్యాటింగ్ చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. హార్దిక్ పాండ్య (1) చేతులెత్తేయగా.. రవీంద్ర జడేజా (16) వాంఖడే ఫామ్ కొనసాగించలేదు. టెయిలెండర్లలో అక్షర్ పటేల్ (29 నాటౌట్) మరోసారి జట్టును ఆదుకున్నాడు. రెండు సిక్సర్లు, ఓ బౌండరీతో భారత్‌కు మూడంకెల స్కోరు అందించాడు. మహ్మద్ సిరాజ్ (0) వికెట్‌తో స్టార్క్ వన్డేల్లో ఏకంగా తొమ్మిదో సారి ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేశాడు. భారత ఇన్నింగ్స్‌లో నలుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే వికెట్ కోల్పోయారు. 26 ఓవర్లలోనే భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ (3/23), నాథన్ ఎలిస్ (2/13) సైతం రాణించారు.

ఓపెనర్లే కొట్టేశారు : 118 పరుగుల ఛేదనలో ఆసీస్‌కు భారత బౌలర్లు సవాల్ విసురుతారనే అంచనాలు కనిపించాయి. కానీ, పిచ్ నుంచి పేసర్లకు అదనపు సహకారం ఏమీ దక్కలేదు. దీంతో ఆసీస్ ఓపెనర్లు వీర విహారం చేశారు. ఓపెనర్లు రెండు ఎండ్‌ల నుంచి దంచి కొట్టారు. మిచెల్ మార్ష్ 28 బంతుల్లో అర్ధ సెంచరీ చేయగా.. ట్రావిశ్ హెడ్ 29 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేశాడు. తొలి వికెట్‌కు అజేయంగా 121 పరుగులు జోడించిన ఓపెనర్లు 11 ఓవర్లలోనే లాంఛనం ముగించారు. భారత బౌలర్లలో ఎవరూ ఆసీస్ ఓపెనర్లను ఇబ్బంది పెట్టలేకపోయారు. 100 ఓవర్ల మ్యాచ్ 37 ఓవర్లలోనే ముగియటంతో అభిమానులు సైతం తీవ్ర నిరాశకు లోనయ్యారు!.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 13, గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 0, విరాట్ కోహ్లి (ఎల్బీ) ఎలిస్ 31, సూర్యకుమార్ యాదవ్ (ఎల్బీ) స్టార్క్ 0, కెఎల్ రాహుల్ (ఎల్బీ) స్టార్క్ 9, హార్దిక్ పాండ్య (సి) స్మిత్ (బి) అబాట్ 1, రవీంద్ర జడేజా (సి) అలెక్స్ (బి) ఎలిస్ 16, అక్షర్ పటేల్ నాటౌట్ 29, కుల్దీప్ యాదవ్ (సి) హెడ్ (బి) అబాట్ 4, షమి (సి) అలెక్స్ (బి) అబాట్ 0, సిరాజ్ (బి) స్టార్క్ 0, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (26 ఓవర్లలో ఆలౌట్) 117.

ఎదురులేని నిఖత్

- ప్రీ క్వార్టర్స్‌లో స్టార్ బాక్సర్

న్యూఢిల్లీ : ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ దూసుకుపోతుంది. ఏకపక్ష విజయాలతో ప్రత్యర్థులపై తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తోంది. మహిళల 50 కేజీల విభాగంలో ఆదివారం జరిగిన రెండో రౌండ్ బౌట్‌లో నిఖత్ జరీన్ 5-0తో ఏకపక్ష విజయం నమోదు చేసింది. అల్జీరియ బాక్సర్ బౌలామ్ రౌమయిసను చిత్తు చేసిన నిఖత్ జరీన్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో ప్రీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. ఆఫ్రికా డిఫెండింగ్ చాంపియన్‌పై పదునైన పంచ్‌లు సంధించిన నిఖత్ జరీన్ ఐదుగురు న్యాయమూర్తుల ఏకగ్రీవ విజేతగా నిలిచింది. 29-27, 30-26, 29-27, 30-26, 29-27తో (5-0) ఐదుగురు జడ్జీలు నిఖత్ జరీన్‌కు తిరుగులేని ఆధిపత్యం కట్టబెట్టారు. ' ఈ విభాగంలో అల్జెరియ బాక్సర్ టాప్ సీడ్. తొలి రౌండ్‌లోనే ఎదురుదాడి చేయాలనే వ్యూహంతో రింగ్‌లోకి దిగాను. సీడింగ్‌తో ఓ అనుకూలత ఉంటుంది. టాప్ సీడ్ బాక్సర్లపై విజయం సాధిస్తే జడ్జీలకు అది ఒక మంచి భావన కలుగజేస్తుంది' అని నిఖత్ జరీన్ తెలిపింది.

డబుల్స్ చాంప్ బోపన్న జోడీ

- ఏటీపీ ఇండియన్‌వెల్స్ మాస్టర్స్

ఇండియన్‌వెల్స్ : 43 ఏండ్ల రోహన్ బోపన్న ఏటీపీ టోర్నీల చరిత్రలో ఓ రికార్డు సాధించాడు. ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిల్ సాధించిన అత్యంత పెద్ద వయస్కుడిగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రోహన్ బోపన్న జోడీ ఏటీపీ 1000 ఇండియన్ వెల్స్ మాస్టర్స్ చాంపియన్‌గా అవతరించింది.

టైటిల్ పోరులో 6-3, 2-6, 10-8తో ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎడ్బెన్ భాగస్వామిగా రోహన్ బోపన్న ఈ ఘనత సాధించాడు. నెదర్లాండ్స్, గ్రేట్ బ్రిటన్ జోడీ వెస్లీ, నీల్ జంట ఫైనల్లో టైబ్రేకర్‌లో పోరాడి ఓటమి పాలైంది. బోపన్న కెరీర్‌లో ఇది ఐదో మాస్టర్స్ టైటిల్ కావటం విశేషం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68